ప్రభుత్వ విద్యాలయల్లో సకల సౌకర్యాలు

- కోనరావుపేటలో రూ.95.50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కోనరావుపేట, నవంబర్. 05(ప్రజాజ్యోతి) ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, వసతి గదులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రాధాన్యత నిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
శుక్రవారం | 6 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 13



సెల్లార్లలో షాపులు.. రోడ్లపై పార్కింగ్‌లు!

2 లో..

- కరీంనగర్‌లో నిబంధనలకు తూట్లు.. ట్రాఫిక్ కష్టాల్లో సామాన్యులు
- కాంప్లెక్స్‌ల యజమానుల ఇష్టారాజ్యం.. అధికారుల పర్యవేక్షణ కరువు

● కరీంనగర్ క్రైమ్, ప్రజాజ్యోతి

కరీంనగర్ క్రైమ్ , నవంబర్ 04 (ప్రజాజ్యోతి): కరీంనగర్ నగరంలో పార్కింగ్ సమస్య రోజు రోజుకూ తీవ్రమవుతోంది. వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు పెరుగుతున్నా.. వాటికి అనుగుణంగా పార్కింగ్ సదుపాయాలు మాత్రం కనిపించడం లేదు నిబంధనల ప్రకారం పార్కింగ్ కోసం కేటాయించాల్సిన సెల్లార్లను సైతం వ్యాపార అవసరాలకు వినియోగిస్తుండటంతో వాహనదారులకు కొత్త కష్టాలు మొదలవుతున్నాయి. భవనాల యజమానులు వ్యాపారాల ద్వారా ఆదాయం పొందుతుంటే.. అక్కడికి వచ్చే వినియోగదారులు మాత్రం తమ వాహనాలను ఎక్కడ నిలపాలో తెలియక రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇప్పటికే రద్దీగా ఉండే ప్రధాన రహదారులు మరింత కిక్కిరిసిపోతున్నాయి. ద్విచక్ర వాహనాలు, కార్లు రోడ్లపైనే నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకునే పరిస్థితులు తలెత్తుతున్నాయి. మరోవైపు ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు కూడా ఈ సమస్య అదనపు భారంగా మారుతోంది.

యువతలో ఓటు హక్కుపై అవగాహన పెంపొందించాలి

- వ్యాసరచన, క్విజ్ పోటీల నిర్వహణకు ఎన్నికల సంఘం నిర్ణయం..



జగిత్యాల, నవంబర్ 5, ప్రజాజ్యోతి. యువతలో ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల కోట్రల్ లిటరసీ క్లబ్ ల ద్వారా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించాలని తెలిపారు. నవంబర్ 2 నుంచి 18 వరకు పాఠశాల, కళాశాల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యువతను బాధ్యతాయుతమైన ఓటర్లుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమాల లక్ష్యమన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.ప్రసూనాంబ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



వేములవాడ,నవంబర్,5 ప్రజాజ్యోతి: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వేములవాడ పట్టణంలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా ప్రతి పనికి సంబంధించి కూలీల సంఖ్య పెంచాలని

మిగతా 2 లో...

రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలి



(మొదటి పేజీ తరువాయి...)

పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ అధికారులు అభివృద్ధి పనులను పరిశీలిస్తూ.. వేగంగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. రాజన్న ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి.. మున్సిపల్ అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. పరిశీలనలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ, ఈ.ఓ, రమాదేవి, ఆర్డీఓ, కే.ఎస్.బీ. కుమారి, ఆర్.అండ్.బీ.ఈ భీమ్లానాయక్, మున్సిపల్, కమిషనర్, లోకేష్, ఆర్ అండ్ బీ, డీ.ఈ, శాంతయ్య, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. ప్రత్యామ్నాయ పంటలే మేలు!

- యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలి
- తక్కువ నీటితో పండే కూరగాయల సాగుకు ప్రోత్సాహం
- రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా ఉచితంగా విత్తన కిట్లు
- ఒక్కో కిట్ విలువ రూ.1,000.. ఏడు రకాల విత్తనాలు



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 05 ప్రజాజ్యోతి: ఎల్‌నినో ప్రభావంతో రానున్న యాసంగి సీజన్‌లో వర్షపాతం లోటు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులు ఇప్పటి నుంచే అప్రమత్తం కావాలని జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు. నీటి లభ్యతపై స్పష్టత లేకుండా వరి సాగు చేపట్టి ఇబ్బందులు పడే బదులు.. తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని కోరారు. రానున్న యాసంగి 2026–27 సీజన్‌లో ఎల్‌నినో పరిస్థితుల కారణంగా సాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, సాగునీటి ప్రాజెక్టుల నుంచి వ్యవసాయ అవసరాలకు నీటి విడుదలపై అనిశ్చితి నెలకొనే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ప్రాజెక్టుల నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను అంచనా వేసుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని ప్రభుత్వం సూచిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో భూములను బీడుగా వదిలేయడం లేదా తక్కువ నీటి అవసరమయ్యే కూరగాయలు, ఇతర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా నీటిని పొదుపు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రైతులను ప్రత్యామ్నాయ సాగు వైపు ప్రోత్సహించేందుకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ (ఎన్ఎస్సీ) ద్వారా ఉచితంగా కూరగాయల విత్తన కిట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఒక్కో కిట్‌లో ఏడు రకాల కూరగాయల విత్తనాలు ఉంటాయని, ఇవి పది గుంటల విస్తీర్ణంలో సాగు చేసుకోవడానికి సరిపోతాయని తెలిపారు. ఒక్కో కిట్ విలువ సుమారు రూ.వెయ్యి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ వివరాలను సంబంధిత మండల ఉద్యానవన అధికారులు లేదా ఉద్యానవన విస్తరణ అధికారులకు అందజేయాలని జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ కోరారు.

సెల్లార్లలో షాపులు.. రోడ్లపై పార్కింగ్‌లు!

సెల్లార్లు పార్కింగ్‌కు కాకుండా వ్యాపారాలకు!

నగరంలో నిర్మిస్తున్న పలు వాణిజ్య భవనాల్లో పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్లను ఇతర వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.కొన్ని చోట్ల మెడికల్ షాపులు,ల్యాబొరేటరీలు,ఇతర దుకాణాలు నిర్వహిస్తున్నారు.మరికొన్ని భవనాల్లో కనీస పార్కింగ్ సదుపాయాలు కూడా లేకుండానే వ్యాపారాలు కొనసాగుతున్నాయి.భవన నిర్మాణ అనుమతులు ఇచ్చే సమయంలో పార్కింగ్ నిబంధనలు పరిశీలించాల్సిన అధికారులు,నిర్మాణం పూర్తయిన తర్వాత వాటి అమలుపై నిరంతర పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. కానీ క్షేత్రస్థాయిలో అలాంటి చర్యలు కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

డాక్టర్ స్ట్రీట్‌లో వాహనదారులకు చుక్కలు!

నగరంలోని డాక్టర్ స్ట్రీట్‌లో పార్కింగ్ సమస్య తీవ్ర రూపం దాల్చింది.ఈ ప్రాంతంలో అనేక ఆసుపత్రులు ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో రోగులు,వారి బంధువులు వాహనాల్లో వస్తుంటారు.అయితే ఆసుపత్రులకు వచ్చే వాహనాలను నిలిపేందుకు సరైన స్థలం లేకపోవడంతో రోడ్లపైనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.రోడ్డుపై వాహనాలు నిలపడంతో ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రోగులను ఆసుపత్రులకు తీసుకెళ్లే సమయంలో కూడా ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఆసుపత్రుల యాజమాన్యాలు పార్కింగ్ సదుపాయాలపై దృష్టి పెట్టకపోవడం ప్రజలకు శాపంగా మారుతోంది.



ప్రధాన రహదారులన్నీ ట్రాఫిక్ ఉచ్చులోనే!

డాక్టర్ స్ట్రీట్‌తో పాటు సవరన్ స్ట్రీట్, క్రిస్టియన్ కాలనీ, కోర్టు రోడ్డు నుంచి మంచిర్యాల చౌరస్తా వరకు,ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యంగా మారింది. రహదారులపై ఆక్రమణలు,ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్, పెరుగుతున్న వాహనాల సంఖ్య సమస్యను మరింత జఠిలం చేస్తున్నాయి.నగరం విస్తరిస్తున్నకొద్దీ జనాభా,వాహనాల సంఖ్యకూడా పెరుగుతోంది.కానీ అందుకు తగినట్లుగా పార్కింగ్ సదుపాయాలు, రహదారుల విస్తరణ,ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టకపోవడంతో నగరవాసులు నిత్యం అవస్థలు పడుతున్నారు.

అధికారుల తనిఖీలు ఏవి.. చర్యలు ఎప్పుడు?

నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లను ఇతర అవసరాలకు వినియోగిస్తున్న భవనాలపై మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. పార్కింగ్ స్థలాలను తిరిగి అందుబాటులోకి తీసుకురావడంతో పాటు,పార్కింగ్ సదుపాయాలు లేని భవనాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.అలాగే ప్రధాన రహదారుల్లో ఆక్రమణలను తొలగించి,ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ విద్యాలయల్లో సకల సౌకర్యాలు



(మొదటి పేజీ తరువాయి...)

మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య, సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.కోనరావుపేట మండల కేంద్రంలో గురువారం రూ.95 లక్షల 50 వేల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి శంకుస్థాపన చేశారు.కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.56 లక్షలతో నూతన వసతి గదులు, టాయిలెట్ల నిర్మాణానికి, రూ.9 లక్షల 50 వేలతో భవిత కేంద్రం నిర్మాణానికి, రూ.30 లక్షలతో ఐకేపీ గోడౌన్ నిర్మాణానికి శిలాఫలకాలను ఆవిష్కరించి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, వసతి గదులు, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేస్తోందని వివరించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడంతో పాటు కాస్మోటిక్, డైట్ చార్జీలను పెంచినట్లు తెలిపారు. యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేస్తూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

పనులను గడువులోగా పూర్తి చేయాలి: కలెక్టర్

కోనరావుపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చేపట్టనున్న వసతి గదులు, టాయిలెట్లు, భవిత కేంద్రం, ఐకేపీ గోడౌన్ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, ప్రణాళిక ప్రకారం పూర్తి చేసి ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

రూ.30 లక్షలతో ఐకేపీ గోడౌన్ నిర్మాణం

కోనరావుపేట మండల కేంద్రంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఐకేపీ గోడౌన్ కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు.

రైతులకు ఉపయోగపడేలా గోడౌన్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మానుక సత్యం కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు కేతిరెడ్డి జగన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య,పీఏసీఎస్ చైర్మన్లు చేపూరి గంగాధర్, బొమ్మెన భాస్కర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఫిరోజ్ పాషా, గొట్టే రుక్మిణి,కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు రాస రవీందర్ రెడ్డి,ఆర్డీఓ కే.ఎస్.బీ. కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, కోనరావుపేట సర్పంచ్ కాశిరామ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బోయిని దేవరాజు, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ స్నిగ్ధ, జీసీడీఓ పద్మజ, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్

- విద్యార్థుల అభ్యసన పురోగతిపై సమీక్ష
- విద్యార్థుల చదువు, హాజరు, ఆరోగ్యం, పరిశుభ్రతపై తల్లిదండ్రులకు అవగాహన
- పిల్లల బంగారు భవిష్యత్తు కోసం పేరెంట్స్ మీటింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలి:
- ఉపసర్పంచ్ తిక్కల నవీన్





కొనరావుపేట, నవంబర్ 5(ప్రజాజ్యోతి)

కొనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలోని ప్రభుత్వ ఏంపిపిఎస్ ప్రాథమిక పాఠశాలలో ఈరోజు పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల విద్యా భ్యాసం, అభ్యసన పురోగతి, పాఠశాల హాజరు, విద్యార్థుల సామర్థ్యాలు, చదువులో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో విస్తృతంగా చర్చించారు. విద్యార్థుల చదువులో మరింత రాణించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు.పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని గుర్తించడం, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. విద్యార్థుల రోజువారీ హాజరు, తరగతి గదిలో వారి ప్రవర్తన, పాఠాలు నేర్చుకునే విధానం, చదువులో చూపిస్తున్న ఆసక్తి తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని ఉపాధ్యాయులు సూచించారు.

మధ్యాహ్న భోజనం, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పిల్లల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు, వారి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులకు తగినంత తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రతి రెండు గంటలకు ఒకసారి, వీలైతే ప్రతి గంటకు ఒకసారి పిల్లలకు తాగునీరు అందించేలా ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వారి చదువు, అభ్యసన సామర్థ్యం, పాఠశాల హాజరు, చదువులో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులలో చదువుపట్ల ఆసక్తిని పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి విద్యార్థి విద్యాప్రగతిని నిరంతరం పరిశీలించాలని పేర్కొన్నారు.

పేరెంట్స్ మీటింగ్‌కు తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలి

ఈ సందర్భంగా బావుసాయిపేట గ్రామ ఉపసర్పంచ్ తిక్కల నవీన్ తల్లిదండ్రులకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. పిల్లల భవిష్యత్తు ఎంతో విలువైనదని, వారి విద్యాభ్యాసం పట్ల ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పాఠశాలలో నిర్వహించే పేరెంట్స్ మీటింగ్‌లకు తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరై తమ పిల్లల చదువు, హాజరు, అభ్యసన పురోగతి గురించి తెలుసుకోవాలని సూచించారు.చాలా మంది తల్లిదండ్రులు పాఠశాలలో నిర్వహించే పేరెంట్స్ మీటింగ్‌లకు హాజరుకాకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు.పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కనీసం ఒక గంట సమయం కేటాయించి పాఠశాలకు రావాలని, ఉపాధ్యాయులతో మాట్లాడి తమ పిల్లలు చదువులో ఎలా రాణిస్తున్నారో తెలుసుకోవాలని కోరారు. లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసంపై నిర్లక్ష్యం చేయకుండా, వారికి ఇంటి వద్ద కూడా చదువుకునేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని సూచించారు.ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలు పాఠశాలలో ఎలా చదువుతున్నారో తెలుసుకోవాలని, ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరపాలని, పాఠశాల నిర్వహించే సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని అన్నారు. వీలైన సమయంలో పాఠశాలకు వెళ్లి పిల్లల చదువు, హాజరు, అభ్యసన పురోగతిని పరిశీలించాలని తెలిపారు.

ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయంతోనే విద్యార్థుల అభివృద్ధి

విద్యార్థుల భవిష్యత్తు కేవలం ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులకు కూడా సమాన బాధ్యత ఉందని ఉపసర్పంచ్ తిక్కల నవీన్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యాబోధన చేస్తే,తల్లిదండ్రులు ఇంటి వద్దపిల్లల చదువుపై పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఇరువర్గాలు సమన్వయంతో బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే విద్యార్థులు విద్యాపరంగా ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు.పిల్లల చదువు, క్రమశిక్షణ, ఆరోగ్యం, హాజరు వంటి అంశాలపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి సారించాలని, పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి తల్లిదండ్రులు తమ వంతు సహకారం అందించాలని తెలిపారు.మన పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా ముందుకు రావాలని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి కృషి చేస్తూ విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఉపసర్పంచ్ తిక్కల నవీన్ పిలుపునిచ్చారు.

ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్



వేములవాడ,నవంబర్,5 ప్రజాజ్యోతి: వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లిలోనీ శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వవిప్, వేములవాడ శాసన సభ్యులు కు ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.ఆలయాల్లో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించడంలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటాయని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్



ఎలిగేడు,నవంబర్ 05(ప్రజా జ్యోతి)ఈరోజు ఎలిగేడు మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాలు 2, 3, 4లను ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ సం దర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించి, సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు.అలాగే చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం,పిల్లల హాజరు,వారి ఎదుగుదల,విద్యాబోధన తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.అంగన్వాడీ కేంద్రా ల ద్వారా చిన్నారులకు మెరుగైన సేవలు అందించాలని, పిల్లల ఆరోగ్యం,పో షణ,ప్రాథమిక విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు.చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలు ఎంతో కీలకమని, వాటి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సర్పంచ్ కప్పల ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పిల్లలు పాల్గొన్నారు.

పండుగ శుభాకాంక్షల పేరుతో వచ్చే నకిలీ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అనుమానాస్పదలింకులు,ఏపీకేఫైల్స్,ఓపెన్,చేయవద్దు సైబర్,మోసాలకుగురికావద్దు
- వేములవాడ పట్టణ పోలీస్ అధికారి వీర ప్రసాద్



వేములవాడ,నవంబర్,5ప్రజాజ్యోతి:పండుగల వేళ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసే పేరుతో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరలేపుతున్నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేములవాడ పట్టణ పోలీస్ అధికారి వీర ప్రసాద్ సూచించారు.పండుగ శుభాకాంక్షల పేరుతో మొబైల్ ఫోన్లకు వచ్చే గుర్తుతెలియని సందేశాలు,అనుమానాస్పదలింకులు,ఏపీకే (ఏపీకే) ఫైల్స్ పట్లప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం పండుగలు,ప్రత్యేక సందర్భాలను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఆకర్షణీయమైన శుభాకాంక్షల సందేశాలు,గ్రీటింగ్ కార్డులు,బహుమతుల పేరుతో నకిలీ లింకులను వాట్సాప్,ఎస్ఎంఎస్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా పంపిస్తున్నారని తెలిపారు. ఆ సందేశాలను నమ్మి వాటిలోని లింకులపై క్లిక్ చేయడం లేదా ఏపీకే ఫైల్స్ ను డౌన్ లోడ్ చేసి ఇన్ స్టాల్ చేయడం వల్ల మొబైల్ ఫోన్ లోని వ్యక్తిగత సమాచారం సైబర్‌నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ముఖ్యంగా తెలియని వ్యక్తులు పంపించే లింకులపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని, అనుమానాస్పద ఫైల్స్ ను ఓపెన్ చేయవద్దని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు సమాచారం, ఓటీపీలు, పాస్ వర్డ్ లు, వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. బ్యాంకు అధికారులు, ప్రభుత్వ అధికారులు లేదా ఇతర సంస్థల ప్రతినిధులమని చెప్పి ఫోన్ చేసినా, సందేశాలు పంపినా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.అదేవిధంగా ఉచిత బహుమతులు, నగదు బహుమతులు, ప్రత్యేక పండుగ ఆఫర్లు అంటూ వచ్చే సందేశాలను గుడ్డిగా నమ్మవద్దని, వాటి నిజానిజాలను సంబంధిత అధికారిక వెబ్ సైట్లు లేదా సంస్థల ద్వారా మాత్రమే నిర్ధారించుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్లలోకి వచ్చే అనుమానాస్పద అప్లికేషన్లను ఇన్ స్టాల్ చేయకుండా ఉండాలని, సైబర్ భద్రతకు సంబంధించిన ప్రాథమిక జాగ్రత్తలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే భయపడకుండా వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930కు ఫోన్ చేయాలని లేదా డబ్ల్యూ, డబ్ల్యూడబ్ల్యూ.సైబర క్రైమ్ .గవర్నమెంట్ .ఇన్ వెబ్ సైట్ లో ఫిర్యాదు నమోదు చేయాలని వీర ప్రసాద్ సూచించారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం వల్ల నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రజలు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, ముఖ్యంగా స్మార్ట్ ఫోన్ వినియోగంపై పూర్తి అవగాహన లేని వారికి కూడా ఈ విషయాలపై అవగాహన కల్పించాలని కోరారు.

ఆగండి,ఆలోచించండి,గుర్తించండి.

అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,పండుగలను సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని వేములవాడ పట్టణ పోలీస్ అధికారి వీర ప్రసాద్ ప్రజలకు సూచించారు.

మాల సంఘ భవన నిర్మాణానికి ఎంపీ నిధులు

- రూ.3 లక్షలు కేటాయించిన ఎంపీ బండి సంజయ్ కుమార్



ఎల్లారెడ్డిపేట , నవంబర్ 5(ప్రజా జ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో మాల సంఘ భవన నిర్మాణానికి కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన ఎంపీ నిధుల నుంచి రూ.3 లక్షలు కేటాయించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో మాల సంఘ భవన నిర్మాణానికి ఎంపీ నిధులు మంజూరు కావడం సంతోషకరమన్నారు. ఈ నిధులతో భవన నిర్మాణ పనులకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షుడు బాలగౌడ్, మెదుసు శ్రీనివాస్ రెడ్డి, చింతల లహరి, మాచర్ల హరికృష్ణ, చీకట్ల ప్రవీణ్, గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్ష ఎన్నికలు



ఎల్లారెడ్డిపేట నవంబర్ 5 ప్రజా జ్యోతి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం రోజు విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్ష పదవికి ఎన్నిక జరగక బండలింగంపల్లికి చెందిన ఆంజనేయ చారి 11 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. తన ప్రత్యర్థి అల్మాస్పూర్ కిష్టయ్యకు 140 ఓట్లు వచ్చాయి ఒక ఓటు చెల్లలేదు ఎన్నికైన అధ్యక్షుడికి పలువురు అభినందనలు తెలియజేశారు ఎన్నికల పరిశీలకులుగా వంగల వసంతము బృందం నిర్వహించింది.

మహిళా భవనం ఐకేపీ గోదాంను సందర్శించిన ఎంపీడీఓ సత్తయ్య



ఎల్లారెడ్డిపేట నవంబర్ 5 ప్రజా జ్యోతి ఎల్లారెడ్డిపేట మండలంలోని హరిదాస్ నగర్ గ్రామంలో గురువారం రోజు ఎల్లారెడ్డిపేట ఎంపీడీవో సత్తయ్య చారి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు?పనులు త్వరగా జరుగుతున్నాయని వివరించిన సర్పంచ్ చిర్రం నాగరాజు యాదవమహిళా భవనం వద్ద 1.25 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణానికి ముగ్గు పోసి మార్కింగ్ ఇవ్వడం జరిగింది హరిదాస్ నగర్ గ్రామములో 30 లక్షలతో నిర్మిస్తున్న ఐకేపీ గోదామును 10 లక్షలతో నిర్మిస్తున్న మహిళా భవనాన్ని ఎంపీడీఓ సత్తయ్య మరియు సర్పంచ్ చిర్రం నాగరాజు యాదవ్ గార్లు కలిసి పరిశీలించారు అనంతరం 1.25 లక్ష లతో మహిళా భవనం వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి ముగ్గు పోయడం జరి గింది ఈకార్యక్రమములో సెక్రెటరీ రమేష్ కొమురయ్య రాజు సీసీ దేవేందర్ నవతా మరియు ఫీల్డ్ అసిస్టెంట్ లత పాల్గొన్నారు.

పత్తిపాక పాఠశాలలో ఘనంగా మెగా పీటీఎం



ధర్మారం,నవంబర్ 5 (ప్రజా జ్యోతి): ధర్మారం మండలం పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో బుధ వారం నిర్వహించిన మెగా తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమా వేశం విజయవంత మైంది.ఈ సందర్భంగా విద్యార్థుల సమ్మేటివ్ అసె స్మెంట్–1 ఫలితాలను తల్లిదండ్రులకు వివ రించి,హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల ను పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రగతి, అభ్యసన లోపాల నివారణ, ఇంటి వద్ద తల్లిదండ్రుల బాధ్యతలపై చర్చిం చారు.ఈసందర్భంగా సర్పంచ్ మాందాల శ్రావణీహరీష్‌మాట్లాడుతూ విద్యా ర్థుల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వంద శాతం హాజరు సాధించిన విద్యార్థులకు బహుమతులు, పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి బ్యాడ్జిలు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాందాల శ్రావణీ హరీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతి మల్లన్న,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ఏలేటి పద్మ లచ్చి రెడ్డి,గ్రామపంచాయతీ కార్యదర్శి తాళ్ల కిరణ్ కుమార్,వార్డు సభ్యులు ఎదుల్ల అంజయ్య, రెచవేణి మహేష్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఎదుల్ల ప్రేమ్ సాగర్, ఉపా ధ్యాయులు గంద్రాతి శ్రీలత, అనుమల్ల శారద, సిరిపురం సునిల్, విద్యావాలం టీర్లు చెక్కపల్లి అరుణశ్రీ, నాగెల్లి సౌజన్య, అం గన్‌వాడీ టీచర్ వినోద, విద్యా ర్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నా తెలంగాణ కోటిరతనాల వీణ ...తెలంగాణమహాకవి,దాశరథి

♦ విక్కుర్తి లక్ష్మీనారాయణ ప్రధానోపాధ్యాయుడు





వేములవాడ,నవంబర్,5 ప్రజాజ్యోతి: నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్య మానికి అక్షరరూపం ఇచ్చినమహాకవి దాశరథి 39 వ, వర్ధంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలో దాశరథి చిత్రప టానికి పూలమాలలు వేసి ఘన నివా ళులు అర్పించడం జరిగింది. ఈ సంద ర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ "తెలం గాణ ప్రాంతానికి చెందిన ప్రముఖ తెలుగు కవి, రచయిత మరియు స్వాతంత్ర్య సమరయోధుడు దాశరథి అని, నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికి అక్షర రూపం ఇచ్చాడని, దాశరథి జూలై 22 1925న ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిన్నగూడూరు గ్రామంలో జన్మించాడని, ప్రాథమిక విద్య చిన్న గూడూరులో, హైస్కూల్ విద్య ఖమ్మం జిల్లా గార్ల లో సాగిందని, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి విద్యాభ్యాసం పూర్తి చేశాడని, నిజాం నవాబు రాక్షస పాలనకు వ్యతిరేకంగా పద్యాలు, గేయాలు రాసి ప్రజలను చైతన్యపరిచా డని, నిజాం వ్యతిరేక పోరాటంలో భాగంగా ఇందూరు (నిజామాబాద్) లో జైలు శిక్ష అనుభవించాడని, జైలు లో ఖైదీలకు రాయడానికి కాగితం, కలం ఇవ్వకపోతే..పళ్లు తోముకోవడా నికి ఇచ్చిన బొగ్గుతో జైలు గోడలపైనే విప్లవాత్మకమైన పద్యాలు రాశాడని, అగ్ని ధార, తిమిరంతో సమరం, రుద్ర వీణ, కవితా పుష్పకం వంటి రచనలు చేశాడని, ఉర్దూ కవి మిర్జా గాలిబ్ గజ ళ్లను తెలుగులోకి దాశరథి అనువదిం చారని, సినిమా రంగంలో దాశరథి అనేక చిత్రాలకు పాటలు రాశారని, ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబాన లమెంతో,గోరింకగూటికేచేరావుచిల కా, గోదారి గట్టుంది గట్టు మీద చెట్టు ఉంది వంటి పాటలు ఎంతో ఆదరణ పొందాయని, 1974లో తిమిరంతో సమరం కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1977 నుండి 1983 వరకు ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగా సేవలు అందించారని, కళాప్రపూర్ణ బిరుదు పొందాడని, తెలంగాణ ప్రభుత్వం దాశరథి జయంతి వేడుకలను పురస్క రించుకొని సాహితీవేత్తలకు 'దాశరథి సాహితి పురస్కారం' అందజేస్తుం దని"పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారా యణ, కంకెల్కార్ మోహన్, అంగ న్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద మరియు విద్యా ర్థులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయండి

- నవంబర్ 9న పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో సభ
- ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలకు న్యూడెమోక్రసీ పిలుపు



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 5 ప్రజా జ్యోతి:భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన పోరాటాల్లో ప్రాణాలర్పించిన విప్లవ యోధుల ఆశయాలను స్మరించుకుంటూ ఈ నెల 9న పెద్దపల్లిలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె. విశ్వనాథ్ తెలిపారు. గురువారం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కేంద్రంలో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి, సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎం ఎస్) జిల్లా అధ్యక్షుడు ఎల్. భీమన్న మాట్లాడుతూ తెలంగాణ, నక్సల్బరి, శ్రీకా కుళం, గోదావరి లోయ, దండకారణ్య ప్రాంతాల్లో సాగిన విప్లవ పోరాటాల్లో వేలాది మంది యోధులు ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. నవంబర్ నెల లోనే చండ్ర పుల్లారెడ్డి, పోట్ల రామనరసయ్య, నీలం రామచంద్రయ్య, జేసీయస్ ప్రసాద్,కొండపల్లిసీతారామయ్య,సంబాలకేశవరావు,అక్కిరాజు హరగోపాల్, మల్లోజుల కోటేశ్వరరావు తదితర విప్లవ కమ్యూనిస్టు నాయకులు అమరులయ్యా రని పేర్కొన్నారు. చారు మజుందార్, దేవులపల్లి వెంకటేశ్వరరావు, సత్యనారా యణ సింగ్, తరిమెల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, మాదాల నారాయణస్వామి, పైలా వాసుదేవరావు వంటి నాయకుల త్యాగాలను కూడా స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు నవంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహిస్తున్నట్లు కె. విశ్వ నాథ్ వెల్లడించారు. ఇందులో భాగంగా పెద్దపల్లి, రామగుండం, గోదావరిఖని ప్రాంతాల్లో సభలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.నవంబర్ 9న ఆదివారం ఉదయం 11 గంటలకు పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించే సభకు ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయా లని కోరారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, రాములు, సత్తయ్య, వెంకటయ్య, రాజు, లక్ష్మీనారాయణ, సంతోష్, పోషన్న తదితరులు పాల్గొన్నారు.

400 కిలోమీటర్ల సైకిల్ యాత్రకు ఘన సన్మానం

- పెద్దపల్లికి చేరుకున్న బీఆర్ఎస్ యాత్ర బృందానికి దాసరి మనోహర్ రెడ్డి అభినందనలు
- స్వగృహంలో పూలమాలలు, శాలువాలతో సత్కారం



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 5 ప్రజా జ్యోతి :మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు సుమారు 400 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర చేపట్టి విజయవం తంగా పూర్తి చేసిన బీఆర్ఎస్ బృందానికి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికి సత్క రించారు. యాత్ర ముగించుకుని పెద్దపల్లికి చేరుకున్న బృంద సభ్యులను తన స్వగృహానికి ఆహ్వానించి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.సైకిల్ యాత్ర బృందానికి ఉప్పు రాజ్ కుమార్ నాయకత్వం వహించగా, సభ్యులు కాశీపాక వాసు, సురేష్, లక్ష్మణ్‌లను దాసరి మనోహర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు దాసరి ప్రశాంత్ రెడ్డి కూడా పాల్గొని యా త్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవం, రైతుల సంక్షేమం, ప్రజా ప్రయోజ నాల పరిరక్షణ లక్ష్యంగా మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు 400 కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజా సమస్య లపై పోరాడాలనే సంకల్పం, రైతుల పట్ల నిబద్ధత, ఉద్యమ స్ఫూర్తికి ఈ యాత్ర నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే పోరాట స్ఫూర్తితో రైతులు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగాలని ఆకాంక్షించారు.కా ర్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, ఓదెల నాయకులు, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు గుణ పతి,టీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కొయ్యడ సతీష్, సురేష్, పుదరి చంద్రశేఖర్, పెంచల శ్రీధర్, ముత్యాల రాజయ్య, గుర్రాల శ్రీను, గోపి, శ్రీనివాస్, నాగరాజు, మధు తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఐకేపీ, సింగిల్ విండో కేంద్రాలు ప్రారంభం

- రైతులు దళారుల చేతిలో మోసపోవద్దు
- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



సుల్తానాబాద్, నవంబరు 5 ప్రజా జ్యోతి:

రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం సుల్తానాబాద్ మండలంలోని నారాయణరావుపల్లి, గొల్లపల్లి, సాంబయ్యపల్లి, దుబ్బపల్లి, ఐతరాజుపల్లి గ్రామాల్లో ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు అందుబాటులో ఉంటూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలని అన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, సింగిల్ విండో చైర్మన్ కల్లేపల్లి జానీ, చిలుక సతీష్ వైస్ చైర్మన్ బండారి రమేష్,సీఈవో నబీవుద్దీన్ సర్పంచులు నామని రాజిరెడ్డి, దీకొండ భూమేష్‌తో పాటు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హరిత సిరిసేడు.. ఇంటింటా మొక్కల పంపిణీ

- పచ్చదనం పెంపొందించడమే లక్ష్యం.. ప్రజల ఆరోగ్యమే ముఖ్యం
- సర్పంచ్ రేనుకుంట్ల శ్యామల-కుమార్



ఇల్లందకుంట, నవంబర్ 05 (ప్రజాజ్యోతి):ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలనే లక్ష్యంతో ఇంటింటా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం హరితహారంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేనుకుంట్ల శ్యామల-కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా స్వచ్ఛమైన గాలితో పాటు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పొందవచ్చని తెలిపారు.మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి పెద్ద చేసే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. నేడు నాటే మొక్కలే రేపటి తరాలకు జీవనాధారమని పేర్కొన్నారు. సిరిసేడు గ్రామాన్ని పచ్చని హరితవనంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు ఉమ్మగోని రమేష్, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సంచార ముస్లింల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- బండారి శేఖర్ డిమాండ్



కరీంనగర్, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): సంచార ముస్లిం తెగల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (AIFB) జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సంచార ముస్లిం తెగల సంఘం ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంచార ముస్లిం కుటుంబాలు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా తీవ్ర వెనుకబాటుతనంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.సంచార ముస్లింల కోసం ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ లేదా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని, ప్రత్యామ్నాయ ఉపాధి కోసం ఏటా రూ.1,000కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు.రూ.10లక్షల వరకు 100 శాతం సబ్సిడీ రుణాలు అందించాలని, తౌఫా-యే-తాలీమ్ పథకాన్ని ప్రారంభించాలని, సంప్రదాయ వృత్తులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి స్థలం, నిధులు కేటాయించడంతో పాటు వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు నివాస, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సంచార ముస్లింలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని, వృత్తులు కోల్పోయిన వారికి నిరుద్యోగ భృతి అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించకపోతే భవిష్యత్తులో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని బండారి శేఖర్ హెచ్చరించారు.

యాదవ సంగంమండల అధ్యక్షుడికి సన్మానం

ఇల్లంతకుంట నవంబర్ 5(ప్రజా జ్యోతి)రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల యాదవ సంగం అధ్యక్షుడు ఓరుపుల రాములు యాదవ్ గౌరవ అధ్యక్షుడు మల్యాల మల్లేశం ప్రధాన కార్యదర్శి బొల్లావేణి అజయ్ ని గురువారం రోజు వెంకట్రావుపల్లి యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు దారవేణి ఎల్లయ్య ఉపాధ్యక్షులు తోట పెల్లి లక్ష్మీనారాయణ పయ్యావుల ఎల్లయ్య మల్లయ్య ఐలయ్య తిరుపతి బీరయ్య మల్లయ్య నాగరాజు ప్రశాంత్ జిల్లా నాయకులు నూనె శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ ఓబీసీ మోర్చా పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా బోయిని నారాయణ



మంథని, నవంబర్ 05 (ప్రజాజ్యోతి): బీజేపీ ఓబీసీ మోర్చా పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షునిగా మంథనికి చెందిన బోయిని నారాయణ నియమించారు. నారాయణను ఓబీసీ మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు శాతరాజు రమేష్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బోయిని నారాయణ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, మంథని నియోజకవర్గంలో ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గందమల్ల ఆనంద్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కొండపాక సత్యప్రకాష్, ఓబీసీ మోర్చా రాష్ట్రకార్యవర్గ సభ్యుడు పిడుగు కృష్ణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శాతరాజు రమేష్, బీజేపీ సీనియర్ నాయకులు మొలుమూరి శ్రీనివాస్, మంథని నియోజకవర్గ బీజేపీ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

రేషన్ కార్డులతో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం

- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో మంథని మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్



మంథని, నవంబర్ 05 (ప్రజాజ్యోతి):రేషన్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రయోజనం చేకూరుతుందని మంథని మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్ తెలిపారు.గురువారం మంథని పట్టణంలోని రేషన్ డీలర్ గుండా ధనలక్ష్మి రేషన్ షాపు పరిధిలోని లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్ పాలకవర్గ సభ్యులు మారుపాక నిహారిక - నాగరాజు, లైశెట్టి రజిత - రాజు, ఎల్లెంకి వంశీధర్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్ కార్డులతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తోందని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. గతంలో పేద ప్రజలకు సన్నబియ్యం అందుబాటులో ఉండేది కాదని, ప్రస్తుతం ప్రజాపాలన ప్రభుత్వం లో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయడం ద్వారా ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన ఆహారం అందించే కార్యక్రమం అమలవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంభోజు సమ్మయ్య, రేషన్ కార్డుల లబ్ధిదారులు పాల్గొన్నారు.

ముగిసిన సింగరేణి స్థాయి ఫుట్ బాల్ పోటీలు

- విజేత ఆర్జీ-1,ఆర్జీ2 జట్టు




గోదావరిఖని, నవంబర్ 5 (ప్రజాజ్యోతి) :గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో డబ్ల్యు పి ఎస్ అండ్ జి ఎ ఆధ్వర్యంలో 2రోజుల పాటు నిర్వహించిన సింగరేణి కంపెనీ స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ గురువారం వైభవంగా ముగిశాయి.సింగరేణిలోని 11 ఏరియాల జట్లు హోరాహోరీగా తలపడిన ఈ పోటీల ఫైనల్ మ్యాచ్‌లో ఆర్జీ-1అండ్ ఆర్జీ-2 సంయుక్త జట్టు విజేతగా నిలవగా మందమర్రి అండ్ బెల్లంపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచింది.ముగింపు వేడుకలకు రామగుండం ఏరియా-1 జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలు అందజేశారు.డి.లలిత్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వాన్ని మాత్రమే కాకుండా మానసిక స్థైర్యాన్ని,క్రమశిక్షణను పెంపొందిస్తాయన్నారు.సింగరేణిలోని 40వేల మంది ఉద్యోగులకు ప్రతినిధులుగా నిలిచి క్రీడాకారులు అద్భుత ప్రతిభ చాటారని కొనియాడారు.సంస్థ సీఎండీ బుద్ధప్రకాష్, డైరెక్టర్ గౌతం పొట్రు క్రీడలను విశేషంగా ప్రోత్సహిస్తూ అవసరమైన నిధులు,వసతులు సమకూరుస్తున్నారని గుర్తుచేశారు.పనిలో చూపెట్టే నిబద్ధత ఆటల్లో కూడా అదే ఉత్సాహాన్ని చూపాలని,ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో కోల్ ఇండియా పోటీల్లో పాల్గొని సంస్థ పతాకాన్ని ఎగురవేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 సేవా అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్,క్వాలిటీ జీఎం వెంకటరమణ,సేఫ్టీ జీఎం మల్లయ్య,రెస్క్యూ జియం శ్రీనివాస్ రెడ్డి,ఎస్వో టు జీఎం చంద్రశేఖర్,ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ రంగు శ్రీనివాస్,ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు క్రాంతి కుమార్,మల్లేష్,సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్ స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి హనుమంతరావు, సేవా ప్రతినిధులు బీనాసింగ్,రజిత,మణి,భాస్కరి,లేడీస్ క్లబ్ కార్యదర్శి శిరీష, అధికారులు చిలుక శ్రీనివాస్,వర ప్రసాద్,జితేందర్ సింగ్,స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు నరేందర్ రెడ్డి,అశోక్,శ్రీనివాస్, పోసనెట్ గాండ్ల రాజయ్య,తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ రిఫరీలు విజయ్‌కుమార్,రేవంత్, వంశీ,దినేష్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ.. రైతులకు అండగా నిలవాలి
- 25 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ.. నూతన పీఏసీఎస్ పాలకవర్గానికి అభినందనలు
- రాష్ట్ర ప్రభుత్వ విప్, వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్





కొనరావుపేట, నవంబర్ 05 (ప్రజాజ్యోతి) రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, రైతులకు అండగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన పాలకవర్గాలు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు రైతులకు అవసరమైన సేవలను సకాలంలో అందించేందుకు పాలకవర్గ సభ్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో వర్షాలు, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళికలతో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.గురువారం రాష్ట్రప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ కొనరావుపేట మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కొలనూరు గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన గ్రామపంచాయతీ భవనానికి, రూ.10 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసుకున్న మహిళా సమాఖ్య సంఘం భవనానికి ప్రారంభోత్సవం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన పరిపాలనా సౌకర్యాలు కల్పించడంతో పాటు మహిళా సంఘాల కార్యకలాపాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.అనంతరం కొనరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన 25 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం చెక్కులను పంపిణీ చేశారు. ఆ తర్వాత కొనరావుపేట మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యుల అభినందన సభలో పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయాల్లో నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవ చేసే వారికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని అన్నారు. పదవులు అనేవి ప్రజలకు సేవ చేసే అవకాశాలని, వాటిని బాధ్యతగా స్వీకరించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఒక పదవికి పలువురు సమర్థులు పోటీలో ఉన్నప్పటికీ పరిపాలనా సౌలభ్యం కోసం ఒకరికే అవకాశం కల్పించాల్సి ఉంటుందని తెలిపారు. పదవులు పొందినవారే గొప్ప వారు, పదవులు పొందనివారు తక్కువ అనే భావన ఎవరికీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజా సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

›» రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆది శ్రీనివాస్ సూచించారు. రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడాలని, పంట చేతికి వచ్చిన అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు.రైతులు పండించిన ధాన్యాన్నిమద్దతు ధరకు కొనుగోలు చేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు సేవ చేయడాన్ని సామాజిక బాధ్యతగా భావించి నూతన పాలకవర్గ సభ్యులు పనిచేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి కీలక నిర్ణయాలు రైతులకు ఎంతో మేలు చేశాయని గుర్తుచేశారు. అదే విధంగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతులకు ఇచ్చినరూ.2లక్షలరుణమాఫీహామీనిఅమలు చేసిందని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25.25 లక్షల రైతు కుటుంబాలకు రూ.20,650 కోట్ల మేర ఏకకాలంలో రుణమాఫీ చేసి రైతులకు ఆర్థిక వెసులుబాటు కల్పించామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన అప్పులు, వడ్డీ భారాలు ఉన్నప్పటికీ రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

›» సన్నధాన్యం సాగుతో రైతులకు అధిక లాభాలు

సన్నధాన్యం సాగు విషయంలో ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో సాగుకు అనుకూలమైన సన్నరకాల వంగడాలను రైతులు ఎంపిక చేసుకోవాలని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రకాలను సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు.సన్నధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందించడంతో పాటు సాధారణ మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అన్నారు.

›» ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు

రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు, నీటి లభ్యతలో మార్పులు వచ్చే అవకాశాలు ఉన్నేపథ్యంలో రైతులు,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆది శ్రీనివాస్ సూచించారు. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టుల్లో 400 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం సుమారు 200 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.నీటి వనరుల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణరూపొందిస్తున్నట్లుతెలిపారు.ప్రతి గ్రామంలో ఒక ఊరకుంట, ప్రతి పొలం వద్ద ఒక నీటి గుంట, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత అనే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చెరువులు, కాలువల మరమ్మతులు చేపట్టడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన ప్రతిపాదనలు అందిస్తే నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు.అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రతి జిల్లా కలెక్టర్ వద్ద రూ.కోటి చొప్పున నిధులు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రాబోయే జనవరి నుంచి ఏప్రిల్, మే నెలల వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గకుండా ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. తద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు నీటి వనరుల అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

›» విద్య, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు. కోడూరుపేట ప్రాంతంలో సుమారు 1,500 మంది విద్యార్థులు చదువుకునేలా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టామని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభమైందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం,దేవస్థానాల అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, వంతెనల నిర్మాణం వంటి అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. గతంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు.

›» ఆరు గ్యారంటీల అమలుతో ప్రజలకు సంక్షేమ ఫలాలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఐదు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ఆది శ్రీనివాస్ అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం ద్వారా 200యూనిట్ల ఉచితవిద్యుత్,రైతురుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.ఇందిరమ్మఇళ్లపథకంకిందఅర్హులైనపేదలకుఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. మొదటి విడతలో వేములవాడ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేశామని, మరో 2,000 ఇళ్లను మంజూరు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. భవిష్యత్తులోనూ అర్హులైన పేదలందరికీ ఇళ్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నూతన పాలకవర్గ సభ్యులపై ఉందని ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రైతులకు అండగా నిలుస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్లు చేపూరి గంగాధర్, బొమ్మాన భాస్కర్ రావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు కేతిరెడ్డి జగన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య,మండల అధ్యక్షులు మానుక సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఫిరోజ్ పాషా, గొట్టే రుక్మిణి,తహసిల్దార్ వరలక్ష్మి,ఎంపీడీవో స్నిగ్ధ ,సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బోయిని దేవరాజు, సర్పంచ్ లు జలగం అరవింద్ రావు, కాశీరాం,గౌతమి, సింగిల్ విండో డైరెక్టర్లు నాలుక సత్యం,భూమయ్య, సత్తవ్వ,మైపాల్ రెడ్డి, శంకర్, సత్యం, శంకరయ్యరామ్ రెడ్డి,అమృత రావు,రాజయ్య ,ప్రకాష్, పుష్పలత,వీరవేణి తిరుపతి యాదవ్, జగిడి భాపురెడ్డి, కార్తీక్,గణేష్, గంగయ్య, సంజీవ్,సుంకరి రెడ్డి,మహిళా సంఘ సభ్యులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





పెద్దపల్లిలో త్వరలో ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

- క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు.. బాలబాలికలకు ప్రత్యేక శిక్షణ
- రిజిస్ట్రేషన్‌కు రూ.1,000.. నెలవారీ రుసుము మరో రూ.1,000
- కోచింగ్‌కు నెలకు రూ.800.. గంటకు రూ.300
- ఎ. సురేష్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 05 ప్రజా జ్యోతి: పెద్దపల్లి జిల్లా క్రీడాకారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టును త్వరలో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న యువతతో పాటు బాలబాలికలకు బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌లో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎ. సురేష్ తెలిపారు.బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కోర్టును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఇండోర్ కోర్టును వినియోగించుకునే క్రీడాకారులు తప్పనిసరిగా రూ.1,000 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు ప్రతి నెలా మరో రూ. 1,000నెలవారీ రుసుము చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.కోచ్ ద్వారా బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌లో ప్రత్యేక శిక్షణపొందే బాలబాలికలకు నెలకు రూ.800 శిక్షణ రుసుముగా నిర్ణయించినట్లు తెలిపారు. గంటల వారీగా కోర్టును వినియోగించుకునేవారికి ఒక గంట బ్యాడ్మింటన్ ఆడేందుకు రూ.300 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు పని వేళలు ఉదయం 5:30 నుంచి 9:30 గంటల వరకు, సాయంత్రం 5:00 నుంచి రాత్రి 9:30 గంటల వరకు ఉంటాయని తెలిపారు. కోర్టులో ఆడే క్రీడాకారులు తప్పనిసరిగా బ్యాడ్మింటన్ షూస్ మాత్రమే ధరించాలని సూచించారు.ఆసక్తి కలిగిన క్రీడాకారులు జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయం,మొదటి అంతస్తు,గది నంబర్ 232లో స్వయంగా లేదా ఫోన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963960063 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎ. సురేష్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మలు

- ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోరా?



ధర్మారం,నవంబర్5(ప్రజా జ్యోతి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని ఖిలావనపర్తి గ్రామం లక్ష్మీనగర్ వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా చెట్లు ఏపుగా పెరిగి విద్యుత్ వైర్లను కమ్ముకున్నాయి.చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగులుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.ప్రధాన రహదారికి ఇరువైపులా ఈ పరిస్థితి ఉండటంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు,పాదచారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గాలివానలకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడితే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదం జరిగాక స్పందించకుండా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తుగా అప్రమత్తమై తక్షణమే చెట్ల కొమ్మలను తొలగించి,విద్యుత్ వైర్లను సరిచేసి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

చామనపల్లిలో ఘనంగా ఆరోగ్య లక్ష్మి సమావేశం



ధర్మారం, నవంబర్ 5 (ప్రజా జ్యోతి): ధర్మారం మండలం చామనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు అధ్వర్యంలో ఆరోగ్య లక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకమిటీ సభ్యులు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన ఆహార సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు బాలామృతం, కోడిగుడ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ వేల్పుల రేవతి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యం,పోషకాహారంతో పాటు విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఎర్ర రాజు భాయ్, ప్రధానోపాధ్యాయులు తిరుపతి, ప్రాథమిక పాఠశాల చైర్మన్ జుంజుపల్లి అనురాధ, ఆశా కార్యకర్త దాసరి సరోజన, గర్భిణులు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల నిర్వహణపై మేట్లకు అవగాహన

- అవగాహన సదస్సులో పాల్గొన్న సర్పంచ్ ఎలుక ఆంజనేయులు



తిమ్మాపూర్ నవంబర్ 5 (ప్రజాజ్యోతి): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలో గురువారం పీబీజీ రామ్ జీ పథకానికి సంబంధించి మేట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీపీవో,డిఆర్డివో ఎంపీడీఓ పాల్గొని మేట్లకు పథకం అమలు,పనుల నిర్వహణ, విధివిధానాలు, బాధ్యతలపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని,కూలీల హాజరు నమోదు, పని ప్రదేశంలో పర్యవేక్షణ, పనుల నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మేట్లు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఎలుక అంజనేయులు మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాభివృద్ధికి తోడ్పడటంతో పాటు కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికారులు, సిబ్బంది, మేట్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు.శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ పనులను విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీపీవో , డి ఆర్ డి ఓ , ఎంపీడీఓ,ఏపీఎం గ్రామ సర్పంచ్ ఎలుక అంజనేయులు, సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో అధిక ధరలకు బియ్యం విక్రయం.. సూపర్ మార్కెట్‌పై కేసు

- ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలి.. అధిక ధరలకు అమ్మితే చర్యలు
- శ్రీ సాయి సూపర్ మార్కెట్‌లో పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు
- కె. శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 05 ప్రజా జ్యోతి: ప్రభుత్వం నిర్ణయించిన ధరలను కాదని బియ్యం విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనాథ్ హెచ్చరించారు. గురువారం పెద్దపల్లి పట్టణంలోని కూనారం రోడ్డులో ఉన్న శ్రీ సాయి సూపర్ మార్కెట్‌లో పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి సూపర్ మార్కెట్‌పై కేసు నమోదు చేశారు. అదే రోడ్డులోని ఏజీ మార్ట్‌లోనూ తనిఖీలు చేపట్టారు.ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరల ప్రకారం బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ. 66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రూ. 74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం బియ్యం రూ.79కు మించి విక్రయించరాదని శ్రీనాథ్ స్పష్టం చేశారు. ప్రతి సూపర్ మార్కెట్‌లో ఈ ధరలు వినియోగదారులకు కనిపించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. బియ్యం కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రఘువీర్ సింగ్, డీటీ పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై పోలీసుల నిఘా

- రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు – ఎస్సై జ్యోతి



ముస్తాబాద్, నవంబర్ 5 (ప్రజా జ్యోతి): ముస్తాబాద్ మండల పరిధిలోని రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా మండలవ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్ల ఇళ్ల వద్ద రాత్రి వేళల్లో ఎస్సై జ్యోతి ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా వారి ప్రస్తుత కార్యకలాపాలు, కదలికలపై ఆరా తీశారు. నేరాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జ్యోతి హెచ్చరించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

పాడి రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక పశువైద్య శిబిరం

- సర్పంచ్ పొన్నం సునీత అనిల్ గౌడ్



తిమ్మాపూర్,నవంబర్ 5 (ప్రజా జ్యోతి): –కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలోని పాడి రైతుల పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు గర్భకోశ వ్యాధుల నివారణ కోసం మండల పశువైద్యాధికారి డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మన్నెంపల్లి గ్రామ సర్పంచ్ పొన్నం సునీత అనిల్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని పాడి రైతులకు పశువుల ఆరోగ్యంపై నిరంతర వైద్య సేవలు, అవసరమైన చికిత్సలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.పాడి పరిశ్రమను ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడటమే లక్ష్యమని పేర్కొన్నారు.ఈ శిబిరంలో మొత్తం 57 పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు అందించారు. పశువుల ఆరోగ్యం, వ్యాధుల నివారణ, పశువుల సంరక్షణపై పాడి రైతులకు వైద్యులు పలు సూచనలు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్ కుమార్,అసిస్టెంట్ డైరెక్టర్, కరీంనగర్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సుస్మిత, డాక్టర్ రేణుక, కమలాకర్, బుచ్చయ్య పాల కేంద్రం అధ్యక్షుడు పోతుగంటి సంపత్, పాల కేంద్రం పాలకమండలి సభ్యులు,పశువైద్య సిబ్బంది,గ్రామ పాడి రైతులు పాల్గొన్నారు.

జీడికే ఓ సి పి-5 ని సందర్శించిన సేఫ్టీ జిఎం



గోదావరిఖని, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): సింగరేణి రామగుండం రీజియన్ సేఫ్టీ జిఎం మల్లయ్య జీడికే ఓ సి పి-5ని సందర్శించారు.గురువారం ఆయన అధికారులతో కలిసి ఓసిపి5 ని పరిశీలించారు.ఓపెన్ కాస్ట్ గనులలో యంత్రాల పనితీరు,ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,గనులలో రక్షణ ప్రాముఖ్యతను వివరించారు.సేఫ్టీ జీ ఎంతో ,గని మేనేజర్ అనిల్ కబాలి, సేఫ్టీ ఆఫీసర్ గంధం రాములు,ఆఫ్ లోడింగ్ ఇంచార్జ్ ఏ.రవికుమార్ ఉన్నారు.

ఖనిని వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం

► రామగుండం మేయర్ మహంకాళి



గోదావరిఖని, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): గోదావరిఖనిని వ్యాపారకేంద్రంగా తీర్చిదిద్దడానికే లక్ష్మీ నగర్,కళ్యాణ్ నగర్ లపై మొదటగా దృష్టి సారించి సుమారు రూ 35 కోట్ల భారీ నిధులతో ప్రదాన రహదారుల అభివృద్ధి పనులు చేపట్టామని రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. ఇప్పుడు గల్లీలను కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు.గురువారం 40వ డివిజన్ లోని కళ్యాణ్ నగర్ లో సి సి రోడ్డు నిర్మాణం పనులను డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య. కార్పొరేటర్ కజంపురం జయప్రద రాజేందర్ తో కలిసి ఆయన ప్రారంభించారు.మేయర్ మాట్లాడుతూ కళ్యాణ్ నగర్ లో యు జి డి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత ప్రభుత్వ హయాంలో ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ నేతృత్వంలో తాము ధర్నా చేశామని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ పనికి ప్రాధాన్యత నిస్తూ ప్రారంభించామన్నారు.జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతి పక్షాల విమర్శలు తిప్పికొట్టి తమకు అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాసరి సాంబమూర్తి,గట్ల రమేష్,వడ్డూరి రవి,నగర పాలక సంస్థ ఎ ఇ తేజస్విని పాల్గొన్నారు.

వేగంగా సాగుతున్న 'నక్ష త్రోవ' పనులు!



గంగాధర 5నవంబర్ 2026 (ప్రజా జ్యోతి): మండలంలోని వెంకంపల్లి గ్రామంలో వీబిజీ – రామ్ – జీ ఉపాధిహామీ పథకం ద్వారా మౌలిక వసతుల కల్పనకు సరికొత్త ఊతం లభిస్తోంది. ఇందులో భాగంగా వెంకంపల్లి గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది.స్థానిక సర్పంచ్ గుండవేని లావణ్య – తిరుపతి ప్రత్యేక చొరవతో గ్రామంలో ఉపాధి హామీ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ముఖ్యంగా, రైతులు, గ్రామస్తుల దశాబ్దాల కల అయిన 'నక్ష త్రోవ' పనులు ప్రస్తుతం ఈ పథకం కింద వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి.

అక్రమ కబ్జా.. ఇంటి నంబరు రద్దు చేయాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట బాధితుల ప్లకార్డులతో ధర్నా
- ఆరు నెలలుగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం
- లీగల్ ఒపీనియన్ వచ్చాక చర్యలు : కమిషనర్ టి.రమేష్



సుల్తానాబాద్, నవంబర్ 5 ప్రజా జ్యోతి: సుల్తానాబాద్ పట్టణంలోని సర్వే నంబర్ 948లో తమకు చెందిన భూమిని అక్రమంగా కబ్జా చేసి,పశువుల షెడకు అక్రమంగా ఇంటి నంబరు పొందారని ఆరోపిస్తూ బాధితులు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో ధర్నా నిర్వహించారు. ఆరు నెలల క్రితం ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ ఇంటి నంబరును వెంటనే రద్దు చేసి తమకు న్యాయం చేయాలని, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.పట్టణంలోని పూసాల రోడ్డుకు చెందిన గరిగె శోభారాణి శ్రీనివాస్, గరిగె తిరుమల, సాహిత్ సౌమ్య, గాజుల పోచం సరోజన, గరిగె సృజన్ తదితరులు తెలిపిన వివరాల ప్రకారం.. తమ మామగారు గరిగె మధురయ్య సర్వే నంబర్ 948 లో 33 గుంటల భూమిని కొనుగోలు చేసి, గతంలో పశువుల కొట్టంగా వినియోగించేవారని పేర్కొన్నారు.అయితే 2007లో పట్టణానికి చెందిన రెండో వార్డు కౌన్సిలర్ గాజుల రాజమల్లు దొడ్ల శ్రీనివాస్ పేరుతో 12 గుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. దీనిపై 2012లో కోర్టును ఆశ్రయించగా 2014లో తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని తెలిపారు.అయినప్పటికీ 2021లో గాజుల రాజమల్లు నకిలీ పత్రాలు సృష్టించి తమ పశువుల షెడ్డుపై మున్సిపల్ కార్యాలయం నుంచి ఇంటి నంబరు పొందారని బాధితులు ఆరోపించారు. అనంతరం గాజుల రాజమల్లు సతీమణి గాజుల రాజ్యలక్ష్మి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో తమ కుమారుడు గాజుల హరీష్ పేరుపై మరో నాలుగు గుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఆరు నెలల క్రితమే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి అక్రమ ఇంటి నంబరును రద్దు చేయాలని దరఖాస్తు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నాకు దిగారు.కమిషనర్ వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.దీంతో మున్సిపల్ కమిషనర్ టి.రమేష్ ధర్నా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు.

›» లీగల్ ఒపీనియన్ వచ్చాక చర్యలు

అక్రమ ఇంటి నంబరు వ్యవహారంపై కమిషనర్ టి.రమేష్‌ను వివరణ కోరగా, ఈ అంశంపై లీగల్ ఒపీనియన్ రావాల్సి ఉందని, అది వచ్చిన తర్వాత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వ్యవహారం తాను కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టక ముందు జరిగిందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని విచారణ జరిపి అక్రమంగా కేటాయించిన ఇంటి నంబరును రద్దు చేయాలని బాధితులు కోరారు. తమకు న్యాయం జరగకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా వికాస్ రావు

► మరిమడ్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సొంత నిధులతో స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ



కోనరావుపేట, నవంబర్. 05(ప్రజాజ్యోతి) గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి, తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని వేములవాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు తెలిపారు. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు, డాక్టర్ దీపా,తమ సొంత నిధులతో స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల విద్యార్థులకు నూతన స్పోర్ట్స్ దుస్తులను స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తమ సొంత నిధులతో స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి, విద్యార్థుల విద్యా వికాసానికి తన వంతు వ్యక్తిగత సహాయ సహకారాలు నిరంతరం అందిస్తానని స్పష్టం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు.సొంత నిధులతో విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు అందించిన డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు, డాక్టర్ దీపాకు విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు కొనియాడారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోలా స్వాతి, బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్ కార్ బాలాజీ, సర్పంచ్ కోల స్వాతి,బీజేపీ జిల్లా నాయకులు గోపాడి సురేందర్ రావు,గొట్టే రామచంద్రం, సిరికొండ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కోనేటి రేణుక, కుమ్మరి దిలీప్ కుమార్, బొల్లం శ్రీనివాస్, తోట్ల వినోద్, బూత్ అధ్యక్షులు అనోక్, తిరుపతి,పాలక వర్గ సభ్యులు,ఉపాధ్యాయులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విదేశాలకు పంపిస్తా అని మోసాలు చేసిన వ్యక్తి అరెస్ట్ రిమాండ్ కి తరలింపు

- ఉపాధి ఆశ చూపి అమాయకులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవు
- మూడు కేసు లలో నిందితుడి రిమాండ్ -వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్



వేములవాడ,నవంబర్,5 ప్రజాజ్యోతి: వేములవాడ రూరల్ ఫాజిల్ నగర్ గ్రామానికి చెందిన వ్యక్తుల ను విదేశాలకు పంపిస్తా అని మోసం చేసిన వోస గంగాధర్ అలియాస్ పడాల.రితీష్ , తండ్రి.భూమన్న, 55 సంవత్సరాలు,ముదిరాజ్ గ్రామం యానాంపల్లి గ్రామం, డిచ్ పల్లి మండలం,కామారెడ్డి జిల్లా అనునతనిని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్టు వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వివరాలలోకి వెళితే బతుకుదెరువు కోసం ఫిజీ దేశం వెళ్లి అక్కడ హోటల్లో చెఫ్ గా పని చేస్తుంటాడు రితీష్ .వేరే దేశంలో పని చేయడం ఇష్టం లేక ఇండియాకి తిరిగి వచ్చి ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దేశం వెళ్లాలనుకునే ప్రజల వద్ద డబ్బులు తీసుకుని వాళ్ళని పంపిస్తానని చెప్పి మోసం చేయడం అలవాటు చేసుకున్నాడు.గతంలో కరీంనగర్ జిల్లా కొత్తపల్లి, మెదక్ జిల్లా రామయంపేట్, నిజామాబాదు పోలీస్ స్టేషన్ లలో పలు గల్ఫ్ చీటింగ్ కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. సులభంగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో విదేశాలలో మంచి ఉద్యోగం వుంది ఇప్పిస్తా అంటూ వేములవాడ రూరల్ మండలం ఫాజిల్ నగర్ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడు కేసులు నమోదు చేయటం జరిగింది చేసి వీరి నుండి మొత్తంగా 16,93,000 రూపాయలు తీసుకొని మోసం చేసినాడు.ఈ సందర్భంగా వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ విదేశాలకు వెళ్లేవారు ప్రభుత్వ అమోదిత ఏజెంట్ ద్వారా మాత్రమే వెళ్ళాలి అని ఉద్యోగాలు ఇప్పిస్తా అని మంచి జీతం వుంది అని అమాయకుల ను మోసం చేసేవారి నుండి జాగ్రత్త గా ఉండాలి అని అలాంటి వారికి చట్ట పరంగా కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు.

ఎల్‌నినో ముప్పును దాటుదాం.. ప్రత్యామ్నాయ పంటలతో లాభాలు పొందుదాం!

- నేల ఆరోగ్యమే.. రైతు భాగ్యమే!
- నీటి పొదుపు - పంటల మార్పిడితో రైతన్నకు లాభాలు: వ్యవసాయ శాఖ అధికారులు

గంగాధర 05 నవంబర్ 2026 (ప్రజా జ్యోతి):
మండలంలోని ఉప్పరమల్యాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ సర్పంచ్ ముద్దం నగేష్ అధ్యక్షతన వ్యవసాయ శాఖ మరియు కేవీకే, జమ్మికుంట ఆధ్వర్యంలో 'ఖేత్ బచావో అభియాన్' మరియు నేల ఆరోగ్యపరిరక్షణ పైనరైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు.

›» భూసారాన్ని కాపాడుకుందాం.. భవిష్యత్ తరాలకు బంగారు పంట లందిద్దాం!

ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త ప్రభాకర్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో నేల ఆరోగ్య పరిరక్షణ ఎంతో ముఖ్యమని, భూసారం తగ్గకుండా భవిష్యత్ తరాలకు సైతం ఆరోగ్యకరమైన నేలను అందించాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందని తెలిపారు. పశుగ్రాస సాగు, పాడి సంపద గురించి ప్రత్యేకంగా తెలియజేశారు. రసాయన ఎరువుల వినియోగాన్ని నేల పరీక్షల ఆధారంగా సమతుల్యంగా చేపట్టాలని, సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, జీవ ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు. పంటల మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా నేలలో పోషక సమతుల్యతను కాపాడుకోవచ్చని వివరించారు.

›» సాంప్రదాయానికి భిన్నంగా.. లాభాల బాటలో ప్రత్యామ్నాయ పంటలు!

వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రియదర్శిని మాట్లాడుతూ ..ఎల్‌నినో ప్రభావం దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో తక్కువ నీటితో పండించే ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, పెసర, మినుము, వేరుశెనగ, ప్రొద్దుతిరుగుడు, నువ్వులు తదితర పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అందుబాటులో ఉన్ననీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటల ఎంపిక, విత్తనాల ఎంపిక చేపట్టాలని కోరారు. వ్యవసాయంలో దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నేల ఆరోగ్యపరిరక్షణ, నీటి పొదుపు, పంటల వైవిధ్యీకరణ, సేంద్రియ వ్యవసాయం వంటి పద్ధతులను రైతులు ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి డివిజన్ ఏడీఏ ప్రియదర్శిని, మండల వ్యవసాయ అధికారి ఆర్. శ్రీనివాస్, ఏఈఓ వెంకట్, పంచాయతీ కార్యదర్శి రాజు, మరియు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఉనికి కోసమే బిఆర్ ఎస్ రాద్ధాంతం

- ప్రమాదాల దృష్ట్యా పైలాన్ తొలగింపు



గోదావరిఖని, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): తరాజకీయంగా ఉనికి కోసమే బిఆర్ఎస్ నాయకులు అనవసరపు రాద్ధాంతం చేస్తున్నారని రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి మండిపడ్డారు గురువారం రామగుండం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రమాదాలు జరుగుతున్నాయని వివిధ వర్గాల నుంచి విజ్ఞప్తుల మేరకే తాము ప్రమాదాలను నివారించడానికి పైలాను తొలగించామని వివరించారు.ఇప్పటికే పలు మార్లు జరగగా కొంతమంది మృత్యువాత పడ్డారని,మరి కొందరు వికలాంగులయ్యారని గుర్తు చేశారు. ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే కోరు కంటి చందర్ దిగజారి వ్యవహరిస్తున్నారని,టిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా తమ ప్రభుత్వం చేస్తుందని ఆరోపించడం సరికాదన్నారు.ఈ విషయంలో తమకు ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదన్నారు. మరో నేత కౌశిక హరి ఒక రాజకీయ వ్యభిచారి అని, హత్య రాజకీయాలకు తెర లేపిన ఆయన ప్రతి ఎన్నికల సందర్భంగా పార్టీలు మారుస్తూ పబ్బం గడుపవిమర్శించారు. ఇప్పటికైనా టిఆర్ఎస్ నాయకులు తమ వైఖరి మార్చుకొని ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు.విలేకరుల ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య,నాయకులు ముస్తఫా,నెల కంటి రాము, యుగంధర్, గట్ల రమేష్, తిప్పారపు శ్రీనివాస్, సాంబమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ వృద్ధాశ్రమ నిర్వహణకు ఎన్‌జీఓల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల, నవంబర్ 5, ప్రజాజ్యోతి. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలోని టి.ఆర్. నగర్ వద్ద నూతనంగా నిర్మించిన 25 పడకల ప్రభుత్వ వృద్ధాశ్రమాన్ని సహ–నిర్వహణ పద్ధతిలో నిర్వహించేందుకు అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థల (NGO) నుంచి జిల్లా సంక్షేమ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.ఆశ్రమ నిర్వహణ వ్యయంలో 70 శాతం ప్రభుత్వం, 30 శాతం ఎంపికైన ఎన్‌జీఓ భరించాల్సి ఉంటుంది. వృద్ధుల సంక్షేమ రంగంలో కనీసం మూడేళ్ల అనుభవం, సంబంధిత రిజిస్ట్రేషన్, 12ఏ/ధ్రువీకరణ కలిగిన సంస్థలు దరఖాస్తు చేసుకోవాలి. నవంబర్ 13లోగా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, జగిత్యాలలో దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు. నవంబర్ 23న దరఖాస్తుల పరిశీలన, నవంబర్ 30న తుది ఎంపిక, ఒప్పందం ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు.

కోనరావుపేటలో బీజేపీకి యువత మద్దతు

- 120 మందికి పైగా పార్టీలో చేరిక

కోనరావుపేట, నవంబర్. 05(ప్రజాజ్యోతి) కోనరావుపేట మండలంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి యువత నుంచి భారీ మద్దతు లభించింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 120 మందికి పైగా యువకులు వేములవాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. ఈ చేరికలతో కోనరావుపేట మండలంలో బీజేపీ మరింత బలోపేతం కానుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.కోనరావుపేట బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్ కార్ బాలాజీ ఆధ్వర్యంలో యువత పార్టీలో చేరిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి బీజేపీ సిద్ధాంతాలు, పార్టీ విధానాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.పార్టీలో చేరిన యువతకు నాయకులు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తును నిర్మించే కీలక శక్తులని అన్నారు. యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో ముఖ్యమైనదని, యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని తెలిపారు.ప్రస్తుతం యువత బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని, పార్టీ సిద్ధాంతాలు, దేశ అభివృద్ధి పట్ల నిబద్ధతకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని అన్నారు. యువతకు పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తుందని, వారి అభిప్రాయాలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుందని తెలిపారు.కోనరావుపేట మండలంలో యువత బీజేపీలో చేరడం పార్టీకి మరింత ఉత్సాహాన్ని అందించిందని నాయకులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. యువత సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజల్లో పార్టీని విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అజ్మీర తండా సర్పంచ్ జయరాం, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గోపాటి సురేందర్రావు ,జిల్లా ఆధ్యాత్మిక సెల్ కో కన్వీనర్ గొట్ట రామచంద్రం ,మండల ప్రధాన కార్యదర్శి బైరగోని సురేష్ గౌడ్, ఎక్కలదేవి జలంధర్,ఉపాధ్యక్షులు ఎడ్ల సుధాకర్ ,చింతల పరిసరాములు,చీకటి మధు, కార్యవర్గ సభ్యులు కడర్ల వికాస్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు జింక వెంకటి, ఓబీసీ మోర్చా జనరల్ సెక్రెటరీ జిన్న అనిల్, చల్ల జితేందర్ రెడ్డి ,ఎస్టి మోర్చా అధ్యక్షులు అజ్మీర వినోద్ ,మరిమడ్ల బూత్ అధ్యక్షులు అనుక్, తిరుపతి ,వెంకటేష్ ,గుండా శ్రీకాంత్ ,విజయ్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మానవత్వం చాటుకున్న వేములవాడ పట్టణ పోలీసులు

- ప్రజా రక్షణే కాదు.. ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించడం కూడా పోలీసుల బాధ్యత

వేములవాడ,నవంబర్,5 ప్రజాజ్యోతి: వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో ఈరోజు సాయంత్రం శివ అనే వ్యక్తి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి రోడ్డుపై కుప్పకూలిపోయాడు. అదే సమయంలో విధి నిర్వహణలో భాగంగా అక్కడ ఉన్న కానిస్టేబుళ్లు సల్మాన్, షకీల్, పంతులు నాయక్, నరేందర్, సతీష్ కుమార్, రాజ్‌కుమార్ ఈ విషయాన్ని గమనించారు.వెంటనే స్పందించిన పోలీసులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా బాధితుడి వద్దకు చేరుకుని మానవతా దృక్పథంతో ప్రథమ చికిత్స అందించారు. బాధితుడికి అవసరమైన సహాయం చేస్తూ చేతులు, కాళ్లు రుద్దడంతో కొద్దిసేపటికే ఆయన స్పృహలోకి వచ్చాడు.విధి నిర్వహణలో ఉన్నప్పటికీ ఆపదలో ఉన్న వ్యక్తిని గమనించి, తక్షణమే స్పందించి మానవత్వం చాటుకున్న పోలీసు సిబ్బందిని స్థానిక ప్రజలు అభినందించారు.



రోడ్డుపై వరిధాన్యం ఆరబోస్తే కేసులు తప్పవు

- రహదారి కి ఇరువైపులా ధాన్యాన్ని ఆరబోసి వాహన దారుల ప్రాణాలకు ముప్పు పెట్టొద్దు
- ముత్తారం ఎస్ఐ ఎన్. రవికుమార్

ముత్తారం, నవంబర్ 05 (ప్రజా జ్యోతి) మండలంలోని రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసి వాహనదారుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తే కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని ముత్తారం ఎస్ఐ ఎన్. రవికుమార్ హెచ్చరించారు. రైతులు రోడ్లపై వరి ధాన్యం ఆరబోయకుండా కల్లాలు, సొంత స్థలాలను వినియోగించుకోవాలని సూచించారు.రహదారులపై ధాన్యం ఆరబోయడం వల్ల వాహనాలు జారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, జరిగిన సంఘటనలు ఇంతకుముందే ఉన్నాయని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే ముప్పు వాటిల్లిందని దీనిని గమనించి రైతులు రోడ్లపై పరిధాన్యాన్ని ఆరబోసి వాహదారణ ఇబ్బందు పెట్టొద్దని ప్రాణానికి ప్రమాదాలు తేవద్దని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించే నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణకు రైతులు, ప్రజలు ముత్తారం పోలీసులకు సహకరించాలని ఎస్సై రవికుమార్ కోరారు.



సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేకూర్తి నవీన్ పటేల్ కూ ఘన సన్మానం

- భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ట్రస్ట్ సభ్యుల ఆకాంక్ష

వేములవాడ,నవంబర్,5 ప్రజాజ్యోతి :
సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో చేకూర్తి నవీన్ పటేల్ కూ ట్రస్ట్ సభ్యులు ఘన సన్మానం చేశారు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వేములవాడ టౌన్ అధ్యక్షులు గా చేకూర్తి నవీన్ నూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు వారికి ట్రస్ట్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసారు చేకూర్తి నవీన్ ప్రజా సేవలో ముందుంటూ వారు చేసిన సేవల కూ ఈ పదవి రావడం చాలా సంతోషం గా ఉందని వారు భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ట్రస్ట్ సభ్యులు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా చేకూర్తి. నవీన్ మాట్లాడుతూ నన్ను పిలిచి నాకు సన్మానం చేసిన సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు సామాజిక సేవలు చేస్తూ పేదలకు అండగా ఉంటున్న సాయి రూప చారిట బుల్ ట్రస్ట్ సేవలు చాలా గొప్ప వని ఈ సందర్భంగా అన్నారు.ఈ సన్మాన కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏద్దండి రాజు,వాసాల.హరి,ప్రసాద్,గొంటి.నవీన్,పబ్బ.సురేష్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



ఇంటి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తులు



వేములవాడ,నవంబర్,5ప్రజాజ్యోతి: వేములవాడ రూరల్ మండలం మర్రి పల్లి గ్రామానికి చెందిన పాటి కళ్యాణి అనే మహిళ తన ఇంట్లో దొంగతనం జరిగింది అని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు వేములవాడ రూరల్ ఎస్ ఐ ప్రశాంత్ రెడ్డి తెలిపారు.వివరాలు కళ్యాణి తన అమ్మగారి ఇల్లు అయిన నాగయ్య పల్లి కి తేదీ 4-11-2026 రోజున మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి వెళ్లింది. అదే రోజు రాత్రి 12 గంటల సమయంలో ఆమె అత్త రమ ఫోన్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించినట్లు వున్నది అని సమాచారం ఇవ్వగా ఇంటికి చేరుకున్న కళ్యాణి ఇంటిని పరిశీలించగా, ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో పాటు బీరువా తాళం కూడా తీసి అందులో భద్రపరిచిన సుమారు 1.5 తులాల బంగారు చైన్,7 వెండి మొలతాడు లు చోరీకి గురైనట్లు గుర్తించింది.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, గుర్తుతెలియని దొంగలను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టినట్టు వేములవాడ రూరల్ ఎస్ ఐ ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

నాగిరెడ్డిపల్లిలో వరి ధాన్యపు కొనుగోలు కేంద్రం ప్రారంభం

- నాగిరెడ్డిపూర్లో ధాన్యం కొనుగోళ్ల సందడి: ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభించిన తహశీల్దార్!



గంగాధర 05/నవంబర్/2026: (ప్రజా జ్యోతి): మండల పరిధిలోని నాగిరెడ్డిపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన (ఐకేపీ) వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ అంబటి రజిత రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అంబటి రజిత మాట్లాడుతూ.. రైతులు తాము కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్ముకుని నష్టపోకుండా,ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ అంబటి రజిత పిలుపునిచ్చారు. అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోందని భరోసా ఇచ్చారు.

›» రైతన్నలు తొందరపడొద్దు: సర్పంచ్ గునుకోండ యశోద

రైతులెవరూ తొందరపడి దళారులను ఆశ్రయించవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే పూర్తి మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. కేంద్రంలో రైతులకు తాగునీరు, నీడ వంటి అవసరమైన మౌలిక వసతులు కల్పించామని అధికారులను కోరారు. కొనుగోళ్లు సజావుగా సాగేలా పాలక వర్గం తరపున పూర్తి సహకారం అందిస్తామని సర్పంచ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం కుమారస్వామి, సర్పంచ్ గునుకొండ యశోద, గంగాధర మాజీ జడ్పీటీసీ గునుకొండ బాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్, మండల మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు చిరుత మంగ, ఉప సర్పంచ్ పంజాల క్రీష్ణ, కార్యదర్శి లావణ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతకు సన్మానం

కొడిమ్యాల,నవంబర్5,(ప్రజాజ్యోతి): చైన్ స్నాచింగ్ నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులకు సహకరించిన అంతడుపుల జలెందర్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పోలీసు అధికారులు సన్మానించారు. నిందితుడి పట్టివేతలో భాగస్వామ్యం కావడం సంతృప్తినిచ్చిందని, ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ పోలీసులకు సహకరిస్తానని జలెందర్ తెలిపారు.



భూ వివాదం దాడి కేసులో ముగ్గురికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష

కోనరావుపేట, నవంబర్. 05 (ప్రజాజ్యోతి)



భూ వివాదం నేపథ్యంలో జరిగిన దాడి కేసులో ముగ్గురు నిందితులకు సిరిసిల్ల మెజిస్ట్రేట్ గడ్డం మేఘన మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారని కొనరావుపేట ఎస్సై బి రామ్మోహన్ గౌడ్ తెలిపారు. ఎగ్లాస్‌పూర్ గ్రామంలో 2018లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసులో నేరం రుజువు కావడంతో న్యాయస్థానం తీర్పునిచ్చిందని .ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం..కోనరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన పిట్టల రాములు, పిట్టల చంద్రమౌళి, పిట్టల తిరుపతిలు 2018 మే 23వ తేదీన అదే గ్రామానికి చెందిన ఫిర్యాదుదారురాలి కుటుంబ సభ్యులపై భూ వివాదం నేపథ్యంలో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఫిర్యాదుదారురాలి భర్త, మామ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది.ఫిర్యాదుదారురాలి దరఖాస్తు మేరకు కొనరావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో సేకరించిన ఆధారాలు, వివరాల ఆధారంగా నిందితులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాదనలు వినిపించారు. నిందితులపై మోపిన అభియోగాలు రుజువు కావడంతో ముగ్గురికి ఒక్కొక్కరికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ గడ్డం మేఘన తీర్పునిచ్చారు.ఈ కేసులో సాక్షులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టడంలో కోనరావుపేట ప్రస్తుత స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఓ) బి. రామ్ మోహన్, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ కె. శ్రవణ్, కోర్టు కానిస్టేబుల్ భాస్కర్ సహకరించారు.దాడి కేసులో నిందితులకు శిక్ష పడటంతో బాధిత కుటుంబానికి న్యాయం జరిగిందని, నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.

దస్తావేజు లేఖరుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



గంగాధర 5 నవంబర్ (ప్రజా జ్యోతి): గంగాధర మండల దస్తావేజు లేఖరుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సీనియర్ రైటర్లు తోట చంద్రయ్య, తాళ్ల అంజయ్య, గంట కిషన్ల సమక్షంలో గురువారం ఈ ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవంగా పూర్తయింది. అధ్యక్షుడిగా చిన్నోజుల మునీందర్, ఉపాధ్యక్షుడిగా బొద్దుల ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా తాండ్ర రమేశ్, కోశాధికారిగా గంగాధర రాజశేఖర్, ఈసీ సభ్యులుగా ఇప్పలపల్లి రమణ, తాళ్ళ సుధాకర్, బొంగని శ్రీముఖ ఎన్నికయ్యారు. మునిందర్ మాట్లాడుతూ.. దస్తావేజు లేఖరుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. లేకరులు అంత ఒకే తాటిపై నడుస్తూ సంఘాన్ని మరింత ముందుకు తీసుకువెళ్దామనీ పిలుపునిచ్చారు.

ఆపదలో ఉద్యోగికి అండగా నిలిచిన పంచాయతీ కార్యదర్శులు

- గడ్డం భూమయ్యకు రూ.12 వేల ఆర్థిక సాయం



రాయికల్, నవంబర్ 05 (ప్రజా జ్యోతి) మానవత్వం ఇంకా సజీవంగానే ఉందని నిరూపిస్తూ, ఆపదలో ఉన్న తోటి ఉద్యోగికి అండగా నిలిచి రాయికల్ మండల పంచాయతీ కార్యదర్శులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. రామాజీపేట గ్రామ పంచాయతీలో యంపిడబ్ల్యూ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న గడ్డం భూమయ్య విద్యుత్ ప్రమాదానికి గురై ప్రస్తుతం చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాయికల్ మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు మానవతా దృక్పథంతో స్పందించారు. భూమయ్య వైద్య ఖర్చులకు చేయూతనివ్వాలనే సంకల్పంతో పంచాయతీ కార్యదర్శులు స్వచ్ఛందంగా తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ క్రమంలో సమిష్టిగా సేకరించిన రూ.12,000/- నగదును భూమయ్యకి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయంగా అందజేశారు. ఆపద సమయంలో పదవులు, హోదాలు, భేదాలు పక్కనపెట్టి తోటి ఉద్యోగి కష్టంలో పాలుపంచుకోవడం నిజమైన మానవత్వానికి నిదర్శనమని పలువురు అభినందిస్తున్నారు. తోటి ఉద్యోగి కష్టాన్ని తమ కష్టంగా భావించి, ఆర్థికంగా అండగా నిలిచిన రాయికల్ మండల పంచాయతీ కార్యదర్శులందరికీ భూమయ్య కుటుంబ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వారి సేవా భావం, ఐక్యత, మానవతా దృక్పథం ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా ఉందని పలువురు అభినందిస్తున్నారు.

మల్లవ్వ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి



ధర్మారం, నవంబర్ 05 (ప్రజా జ్యోతి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన కళ్యెం మల్లారెడ్డి సతీమణి కళ్యెం మల్లవ్వ పరమపదించడంతో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి గురువారం వారి నివాసానికి వెళ్లి మల్లవ్వ భౌతికకాయానికి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా మల్లవ్వ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.ఆయన వెంట గోపాలరావుపేట గ్రామ సర్పంచ్ సంకసాని సౌజన్య సతీష్ రెడ్డి,నంది మేడారం సింగిల్ విండో చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు,మాజీ ఏఎంసీ చైర్మన్లు గుర్రం మోహన్ రెడ్డి, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ భరత్ స్వామి, మాజీ సర్పంచ్ లు శ్రీనివాస్ రెడ్డి, జనగామ అంజయ్య,లత,అపర్ణ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం



ధర్మారం, నవంబర్ 05 (ప్రజా జ్యోతి): బొమ్మారెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దార రాజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు నెలల వయస్సు నిండిన చిన్నారులకు అన్నప్రాసన చేయించగా, మూడు సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ దార రాజ్ కుమార్ చిన్నారులకు అన్నప్రాసన,అక్షరాభ్యాసం కార్యక్రమాలను స్వయంగా నిర్వహించి, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.అనంతరం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంకరి నర్సింగం, ప్రధానోపాధ్యాయులు జనగామ రాజేశం, అంగన్వాడీ టీచర్లు కాశిరెడ్డి సునీత, బొల్లి కవిత, ఉపాధ్యాయులు రఫీ, హైమావతి, సంధ్య, విద్యా వాలంటీర్ రమ, ఆశా వర్కర్లు దాడి మల్లీశ్వరి, రాజారపు లలిత, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్య పరిరక్షణతోనే అధిక దిగుబడులు

► సహజ వ్యవసాయం, నీటి సంరక్షణపై రైతులకు అవగాహన



బుగ్గారం, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సహజ వ్యవసాయ పద్ధతులను పాటించినప్పుడే భవిష్యత్తులో మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. బుగ్గారం మండలం వెల్గొండ గ్రామంలో గురువారం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించి రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ,సహజ వ్యవసాయం, నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆత్మ పీడీపీడీ సుధాకర్ మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయన ఎరువులు,పురుగుమందుల వాడకం వల్ల నేల సారం దెబ్బతింటుందని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుల సాగు, పంట మార్పిడి, పంట అవశేషాలను భూమిలో కలపడం వంటి పద్ధతులతో భూసారాన్ని పెంపొందించుకోవచ్చన్నారు.ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలనిసూచించారు.సాంకేతిక వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ సహజ వ్యవసాయంలో జీవామృతం, ఘనజీవామృతం, బీజామృతం వంటి ప్రకృతి సిద్ధమైన ఎరువులను వినియోగించాలని తెలిపారు. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించి పర్యావరణాన్ని, నేలలోని జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.జాతీయప్రకృతి వ్యవసాయ మిషన్ లక్ష్యాలు, ప్రయోజనాలను వివరించారు.మండల వ్యవసాయ అధికారి అక్షిత మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవడంతో పాటు పప్పుధాన్యాలు, నూనె గింజల సాగును ప్రోత్సహించాలన్నారు. వర్షపు నీటిని పొలాల్లో నిల్వ చేసుకోవడం, పొలాల గట్లను పటిష్టం చేయడం, నేలపై పంట అవశేషాలతో కప్పడం, నీటిని పొదుపుగా వినియోగించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని వివరించారు.కార్యక్రమంలో సర్పంచి నీలం నందిని,వ్యవసాయ విస్తరణ అధికారి నవీద్, పంచాయతీ కార్యదర్శి సతీష్,రైతులు పాల్గొన్నారు.

ఆపద సమయంలో అండగా.. బాడీ ఫ్రీజర్ వితరణ

• పాతగూడూరు గ్రామ పంచాయతీకి రూ.80 వేల విలువైన పరికరం అందజేత



ఎండపల్లి, నవంబర్ 5 ప్రజా జ్యోతి గ్రామంలో ఎవరైనా మృతి చెందినప్పుడు దూర ప్రాంతాల నుంచి వచ్చే బంధువులు అంతిమ దర్శనం చేసుకునేందుకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో మండలంలోని పాతగూడూరుకు చెందిన సుంకిశేలా శ్యామసుందర్ రావు ఉదారత చాటుకున్నారు. తన తండ్రి సుంకిశేల నారాయణరావు స్వగ్రామమైన పాతగూడూరు గ్రామ ప్రజల సౌకర్యార్థం రూ.80 వేల విలువైన బాడీ ఫ్రీజర్‌ను గ్రామ పంచాయతీకి వితరణగా గ్రామ పాలకవర్గం, గ్రామస్థుల సమక్షంలో ఈ బాడీ ఫ్రీజర్‌ను అందించారు. గ్రామంలో విషాద ఘటనలు చోటుచేసుకున్న సమయంలో మృతుల బంధువులకు ఉపయోగపడేలా చేసిన ఈ సహకారంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సామాజిక అవసరాన్ని గుర్తించి ముందుకొచ్చిన శ్యామసుందర్ రావు కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొంగల జగదీశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ మేడిపల్లి సత్యనారాయణ, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి ఆవాసానికి శ్రీ దుర్గా భవాని సేవా సమితి చేయూత

► 50 కిలోల బియ్యం, పండ్లు, రూ.2,500 నగదు అందజేత



బుగ్గారం, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): సేవా భావంతో నిరుపేదలకు అండగా నిలవడమే లక్ష్యంగా బుగ్గారం ఎల్ల నాగలి చౌరస్తా కేంద్రంగా పనిచేస్తున్న శ్రీ దుర్గా భవాని సేవా సమితి సభ్యులు ముందడుగు వేశారు. సమితి ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని వాల్మీకి ఆవాసం – సేవాభారతికి నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో భాగంగా 50 కిలోల బియ్యం, పండ్లు, రూ.2,500 నగదును ఆవాసం నిర్వాహకులకు అందించారు.సమితి కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు సభ్యులు తెలిపారు. సమాజంలో ఆపన్నులకు, అవసరంలో ఉన్నవారికి తమ వంతు సహాయం అందించాలనే సంకల్పంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సామాజిక బాధ్యతను చాటుకోవడంతో పాటు మరికొందరిలో సేవాభావాన్ని పెంపొందించడమే తమ ఉద్దేశమన్నారు.రాబోయే రోజుల్లో కూడా పేదలు, నిరాశ్రయులు, అభాగ్యులకు అండగా నిలుస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా భవాని సేవా సమితి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐజేయూ నూతన కార్యవర్గానికి కాంగ్రెస్ నాయకుల ఘన సన్మానం

మల్లాపూర్, నవంబర్ 5, ప్రజాజ్యోతి మండల ఐజేయూ నూతన కార్యవర్గ సభ్యులను కుస్తాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గురువారం గ్రామంలోని శివాలయం వద్ద కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ సరికెల మహిపాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజేయూ మండల నూతన అధ్యక్షుడు సభావత్ మల్లేష్, ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బద్దం రాంచందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు ర్యాగల్ల వెంకటేశ్వర్, కార్యవర్గ సభ్యుడు నిమిషకవి రాజేష్, సభ్యుడు సింగిరెడ్డి జీవన్ రెడ్డిలను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ ఉపాధ్యక్షుడు చలిగంటి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి నర్సయ్య, కార్యదర్శి రాజేశ్వర్, కోశాధికారి ప్రసాద్, మండల కార్యవర్గ సభ్యుడు రాఘవులు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



వృద్ధుల హక్కులకు రక్షణ

♦ గిఫ్ట్ డీడ్ ను రద్దు చేసిన కలెక్టర్



జగిత్యాల, నవంబర్ 5, ప్రజాజ్యోతి. వృద్ధాప్యంలో తల్లి దండ్రుల పోషణను విస్మరించిన కుమారుల నుంచి వ్యవసాయ భూముల గిఫ్ట్ డీడ్ ను కలెక్టర్ రద్దు చేస్తు ఉత్తర్వులు జారీ చేయగా అట్టి ఉత్తర్వులను జిల్లా లోని మల్యాల మండలం లో అమలు చేసిన ఉదంతం చర్చనీయాంశంగా మారింది. ఇందుకు సంబందించిన వివరాల ప్రకారం...మల్యాల కు చెందిన గుమ్లాపూర్ మల్లేశం, లక్షి అనే వృద్ధ తల్లి దండ్రులను ఇద్దరు కుమారులు సాకడం లేదంటూ దాదాపు రెండేళ్ల కిందట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయం తో జగిత్యాల ఆర్డీవో ను ఆశ్రయించారు.అనంతరం ఆర్డీవో ఇచ్చిన తీర్పును ఆ వృద్ధుల కుమారులు పాటించకపోవడంతో వారు సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయంతో ఆ తల్లి దండ్రులు అప్పిలెట్ ట్రిబ్యునల్ అధికారి అయి న కలెక్టర్ కు గిఫ్ట్ డీడ్ రద్దు కు అప్పీల్ చేశారు.విచారణ జరిపిన కలెక్టర్ గతంలో తల్లి దండ్రులు తమ కుమారులకు గిఫ్ట్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన వ్యవసాయ భూములను రద్దు చేయుటకు కలెక్టర్ వయో వృద్ధుల సంరక్షణ చట్టం కింద ఉత్తర్వులు జారీచేశారు . కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మల్యాల తహసీల్దార్ శ్రీనివాస్ స్వయంగా రిజిస్ట్రేషన్ కార్యాలయం కు వెళ్లి మల్లేశం పెద్ద కుమారుడు అయిన నరేష్ పేరిట ఉన్న 1 ఎకరం 12 గుంటల వ్యవసాయ భూమికి సంబందించిన గిఫ్ట్ డీడ్ ను సబ్ రిజిస్ట్రార్ ఇమ్రాన్ ఖాన్ చేత బుధవారం రద్దు చేయించి, తిరిగి తండ్రి పేరిట పట్టా అమలు చేశారు..ఈ రద్దు కని పెంచిన వృద్ధ తల్లి దండ్రులను నిరాదరిస్తున్న కుమారులకు, కూతుర్లకు, వారసులకు గుణపాఠం లా ఉందని, ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ సత్య ప్రసాద్,అమలు చేయించిన మల్యాల తహసీల్దార్ శ్రీనివాస్ లకు తమ అసోసియేషన్ తరపున సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

బిజెపి పార్టీ.ఓ బి సి మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా ముల్కోజ్ వెంకటేశ్వర్లు

కాల్వ శ్రీరాంపూర్ నవంబర్ 5 (ప్రజా జ్యోతి)



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని. కిష్టంపేట్ గ్రామానికి చెందిన. బిజెపి పార్టీ .సీనియర్ నాయకుడు ముల్కోజ్ వెంకటేశ్వర్లను. శనివారం రోజున బిజెపి పార్టీ .ఓ బిసి ఉపాధ్యక్షుడిగా. బిజెపి పార్టీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ శాసనసభ్యులు గుజ్జుల రామకృష్ణారెడ్డి శనివారం రోజున నియమించారు. నా నియామకానికి సహకరించిన.బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి.ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు చాత రాజు రమేష్. బిజెపి పార్టీ జిల్లా కార్యదర్శి. నారాయణస్వామి లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా జ్యోతివిలేఖరి మాట్లాడుతూ నాపై నమ్మకంతో అధిష్టాన వర్గం పదవిని ఇచ్చినందుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

పేదల బియ్యంపై అక్రమ దందా.. 23.80 క్వింటాళ్లు పట్టివేత

■ తక్కువ ధరకు కొనుగోలు.. పౌల్ట్రీ ఫారాలకు అధిక ధరకు విక్రయం.. ఇద్దరిపై కేసు



వీణవంక, నవంబర్ 5 (ప్రజాజ్యోతి) పేదలకు అందాల్సిన రేషన్ బియ్యంపై అక్రమ వ్యాపారానికి తెరలేపిన ఇద్దరి బాగోతం బయటపడింది. వీణవంక మండలం కోరుకల్ గ్రామంలోని వాసవి ఎంటర్‌ప్రైజెస్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 23.80 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. బియ్యంతో పాటు అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్న అశోక్ లేలాండ్ వాహనం (ఏపీ -09-టిఏ -9411)ను స్వాధీనం చేసుకున్నారు.ఈ టీప్ హైదరాబాద్ అధికారుల సమాచారంతో నవంబర్ 5న సివిల్ సప్లై అధికారులు, సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించగా ఈ అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. విచారణలో పేదలకు పంపిణీ చేయాల్సిన పిడిఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, అధిక ధరలకు పౌల్ట్రీ ఫారాలకు విక్రయిస్తున్నట్లు వెల్లడైంది.ఈ ఘటనలో కుర తిరుపతి (ఏ-1),నర్ల వెంకటేశ్వర్లు (ఏ 2)పై వీణవంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అక్రమ బియ్యం వ్యాపారంపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.

మాల సంఘం నూతన అధ్యక్షుడికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అభినందనలు

ఎండపల్లి, నవంబరు 5 ప్రజా జ్యోతి మండలంలోని చర్లపల్లి గ్రామ మాల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పడిదం సత్తయ్య గురువారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.కొప్పుల ఈశ్వర్ ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపా రు. మాల సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి నూతన అధ్యక్షుడు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర కార్యదర్శి మేరుగు జానీ మాల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అల్లీపూర్ పల్లె దవాఖానకు జాతీయ స్థాయి గుర్తింపు



రాయికల్ నవంబర్ 05 (ప్రజా జ్యోతి) రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖాన)కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. జాతీయ నాణ్యత ప్రమాణాల హామీలో భాగంగా ఈ గుర్తింపును అందుకున్నారు. ఆగస్టు 13న వర్చువల్ విధానంలో నిర్వహించిన మూల్యాంకనంలో ఆరోగ్య మందిర్‌లోని మౌలిక వసతులు, వైద్య సేవలు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలు, నిర్వహణ తీరుతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ మూల్యాంకనంలో 91.89 మార్కులు సాధించడంతో జాతీయ నాణ్యతా ప్రమాణాల గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు ద్వారా ఆరోగ్య మందిర్ అభివృద్ధి, మెరుగైన వైద్య సేవల కోసం ఏటా మూడు సంవత్సరాల పాటు నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా జాతీయ స్థాయి గుర్తింపు సాధించేందుకు కృషి చేసిన వైద్య సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్ అభినందించారు.

16వ వార్డులో మిషన్ భగీరథ నీటి సరఫరా పునరుద్ధరణకు కౌన్సిలర్ పొట్ట సురేందర్ ప్రత్యేక చొరవ

- ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా అధికారులపై ఒత్తిడి..
- వెంటనే ప్రారంభమైన మరమ్మతు పనులు!





కోరుట్ల,నవంబర్ 05 ప్రజాజ్యోతి కోరుట్ల 16వ వార్డు ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించడమే లక్ష్యంగా వార్డు కౌన్సిలర్ పొట్ట సురేందర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వార్డులో తాగునీటి సరఫరాకు ఏర్పడిన ఇబ్బందులను గుర్తించిన ఆయన, సమస్యను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ డీఈతో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను కోరారు. కౌన్సిలర్ విజ్ఞప్తికి అధికారులు వెంటనే స్పందించి 16వ వార్డులో మరమ్మతు పనులను ప్రారంభించారు.

›» ప్రజా సమస్యల పరిష్కారమే ప్రాధాన్యత

వార్డులో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు కౌన్సిలర్ పొట్ట సురేందర్ పేర్కొన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, ముఖ్యంగా తాగునీటి సమస్యలు లేకుండా చూడడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు.ప్రజలకు అవసరమైన సమయంలో స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఏఈ సూర్య శ్రీనివాస్, వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల షాదీఖానా, ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఫైర్!

- ఎన్నికల సమయంలోనే ముస్లింలు గుర్తుకొస్తారా?
- ఓట్లతో గెలిచాక సమస్యలు పట్టవా? అంటూ స్థానిక ఎమ్మెల్యేపై విమర్శలు
- షాదీఖానా నిర్మాణం పూర్తిచేయడంలో నిర్లక్ష్యం..
- 100 పడకల ఆసుపత్రిలో వైద్యుల కొరతపై తీవ్ర అసంతృప్తి
- విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్ల పంపిణీ కార్యక్రమంలో విద్య, వైద్యం, ముస్లింల సమస్యలపై కీలక వ్యాఖ్యలు







కోరుట్ల, నవంబర్ 5 ప్రజాజ్యోతి కోరుట్ల పట్టణంలో ముస్లిం షాదీఖానా నిర్మాణం పూర్తికాకపోవడం, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందకపోవడంపై నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు ఎంతో అవసరమైన సమస్యల పరిష్కారంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో మాత్రమే ముస్లింలు గుర్తుకొస్తారా? వారి ఓట్లతో గెలిచిన తర్వాత వారి సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ప్రశ్నించారు. కోరుట్లలో షాదీఖానా నిర్మాణం పూర్తిచేయడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) పార్టీ అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు గురువారం కోరుట్ల పట్టణంలోని గడి గురుజు ప్రాంతంలో ఉన్న ఏజేఎం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పదో తరగతి విద్యార్థులకు ఉచిత ఆల్ ఇన్ వన్ 2026 గైడ్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాలారే మిల్లత్, మాజీ ఎంపీ దివంగత సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ పేరుతో రూపొందించిన గైడ్లను విద్యార్థులకు అందజేశారు.

›» షాదీఖానా నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుంది?

ఈ సందర్భంగా కోరుట్ల పట్టణంలోని ముస్లిం షాదీఖానా నిర్మాణంపై ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముస్లిం కుటుంబాలకు ఎంతో ఉపయోగపడే షాదీఖానా నిర్మాణం ఇంకా పూర్తికాకపోవడం బాధాకరమని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు వివాహాది శుభకార్యాలు నిర్వహించుకునేందుకు షాదీఖానా ఎంతో అవసరమని, అలాంటి ప్రజా అవసరాన్ని గుర్తించి నిర్మాణ పనులను వేగవంతం చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఈ విషయంలో తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ముస్లింల ఓట్లు కావాలి, ఎన్నికలు పూర్తయిన తర్వాత వారి సమస్యలు గుర్తుకు రావా? అంటూ ప్రశ్నించారు. ప్రజల అవసరాలను విస్మరించడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ కోరుట్లలో నిర్మాణంలో ఉన్న షాదీఖానా అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించకపోవడం విచారకరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన నిధులు మంజూరు చేయించి షాదీఖానా నిర్మాణాన్ని త్వరగా పూర్తిచే సేలా కృషి చేయాలని కోరారు.

›» 100 పడకల ఆసుపత్రి ఉన్నా.. వైద్య సేవలు ఎక్కడ?

కోరుట్ల పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితిపైనా మాజిద్ హుస్సేన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పేరుకు 100 పడకల ఆసుపత్రి ఉన్నప్పటికీ ప్రజలకు ఆశించిన స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని పేర్కొన్నారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడం, సమయానికి వైద్య సేవలు అందకపోవడం వల్ల రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రులు పేద ప్రజలకు ప్రాణాధారమని, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేని పరిస్థితుల్లో ప్రభుత్వ వైద్య సేవలపైనే ఆధారపడతాయని గుర్తుచేశారు. అలాంటి ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండటంతో పాటు ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాల్సిన అవసరం ఉందన్నారు.కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

›» పేద విద్యార్థుల విద్యకు మజ్లిస్ పార్టీ అండ

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి మజ్లిస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజిద్ హుస్సేన్ తెలిపారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థికూడా చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో పార్టీ గత 26 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ఆల్ ఇన్ వన్ గైడ్లను పంపిణీ చేస్తోందని వివరించారు.పదో తరగతి వార్షిక పరీక్షలు విద్యార్థుల జీవితంలో కీలకమైనవని, ఈ సమయంలో విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ గైడ్లు పరీక్షల సన్నద్ధతకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

›» ఉర్దూ విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ముస్లిం విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉర్దూ భాష పరిరక్షణకు, ఉర్దూ మీడియం పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తోందని తెలిపారు. పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ, శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ లు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. దారుస్సలాంలో ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.


›» ఆర్థిక ఇబ్బందులుంటే సంప్రదించండి.. విద్యా ఖర్చులకు సహాయం

పదో తరగతి విద్యార్థులకు పుస్తకాలు కొనుగోలు చేయడంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైతే జగిత్యాల జిల్లా ఎంఐఎం పార్టీ అధ్యక్షులు, కోరుట్ల పట్టణ అధ్యక్షులు, పార్టీ కార్యవర్గ సభ్యులను సంప్రదించాలని మాజిద్ హుస్సేన్ సూచించారు. విద్యార్థుల అవసరాలను పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ దృష్టికి తీసుకెళ్లి మజ్లిస్ పార్టీ తరపున అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.పేద విద్యార్థుల విద్యకు అవసరమైన ఖర్చులను భరించేందుకు కూడా పార్టీ సిద్ధంగా ఉందని, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలకు చెందిన పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, జగిత్యాల జిల్లా ఎంఐఎం అధ్యక్షులు లియాఖత్ అలీ మొహసిన్, కోరుట్ల పట్టణ ఎంఐఎం అధ్యక్షులు మహమ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ వాజిద్, కోశాధికారి ముజాహిద్, కోరుట్ల ఎంఐఎం పార్టీ ఐకాన్ అబ్దుల్ రహీం, హఫీజ్ ఖురేషి, కలీం, సల్మాన్, హాజీ, ఇసాక్, సమీర్, హమీద్, నాహిద్ తదితరులు పాల్గొన్నారు.



కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అసలేం జరుగుతోంది?

- వార్నింగులతో మొదలై.. తనిఖీలు, సస్పెన్షన్ల వరకు.. చివరకు సన్మానాలతో ముగిసిన వివాదమా?
- 100 పడకల ఆసుపత్రి సమస్యలకు పరిష్కారం ఎక్కడ?
- రాజకీయ విమర్శల మధ్య ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఎన్నో ప్రశ్నలు!



కోరుట్ల, నవంబర్ 05 ప్రజా జ్యోతి

కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతూ పట్టణంలో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి ఇప్పుడు రాజకీయ విమర్శలు, అధికారుల తనిఖీలు, హెచ్చరికలు, సస్పెన్షన్ ఉత్తర్వులు, తిరిగి సన్మానాల వ్యవహారంతో వార్తల్లో నిలుస్తోంది. అసలు ఆసుపత్రిలో ఏం జరుగుతోంది? సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది? ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమా? లేక ఈ వ్యవహారం రాజకీయ ప్రతిష్ఠకు సంబంధించిన అంశంగా మారిందా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

›› ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ.. అధికారులపై ఆగ్రహం!

ఇటీవల కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని పరిస్థితులను పరిశీలించిన ఆయన నిర్వహణ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 100 పడకల ఆసుపత్రిగా చెప్పుకుంటున్నప్పటికీ అందుకు తగిన సౌకర్యాలు, సేవలు కనిపించడం లేదంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు."ఇది 100 పడకల ఆసుపత్రా? లేక పల్లెటూరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రామా?" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో చర్చనీయాంశంగా మారాయి.ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపడాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.

›› కలెక్టర్ తనిఖీ.. సూపరింటెండెంట్‌పై సస్పెన్షన్ వేటు!

ఎమ్మెల్యే తనిఖీ జరిగిన కొద్ది రోజులకే అక్టోబర్ 31న జిల్లా కలెక్టర్ కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. సునీతా రాణి సంబంధిత ఉన్నతాధికారి నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా విధులకు గైర్హాజరైనట్లు గుర్తించినట్లు సమాచారం.దీంతో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ పరిణామం ఆసుపత్రి వర్గాల్లోనే కాకుండా పట్టణ ప్రజల్లోనూ చర్చకు దారితీసింది.

›› 100 పడకల ఆసుపత్రి ప్రారంభంపై కాంగ్రెస్ నేత విమర్శలు!

మరోవైపు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రి పరిస్థితులపై విమర్శలు గుప్పించారు.100పడకల ఆసుపత్రిని పూర్తిస్థాయి సౌకర్యాలు, అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బంది అందుబాటులోకి తీసుకురాకుండానే హడావుడిగా ప్రారంభించి ప్రజలను మభ్యపెట్టారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌పై విమర్శలు చేశారు. దీంతో ఆసుపత్రి అభివృద్ధి, ప్రారంభోత్సవం, వైద్య సౌకర్యాల కల్పన అంశాలు రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారాయి.

›› సస్పెన్షన్ తర్వాత కృతజ్ఞతల సన్మానం.. చర్చకు దారితీసిన పరిణామం!

ఇన్ని పరిణామాల మధ్య మరో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీతారాణి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానించడం చర్చనీయాంశంగా మారింది.ఒకవైపు ఆసుపత్రి నిర్వహణపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేయడం, మరోవైపు కలెక్టర్ తనిఖీ అనంతరం సూపరింటెండెంట్ సస్పెన్షన్‌కు గురికావడం, ఆ తర్వాత ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానం జరగడం.. ఈ పరిణామాల క్రమంపై పట్టణంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

›› ప్రజలకు కావాల్సింది సన్మానాలు కాదు.. మెరుగైన వైద్య సేవలు!

ఇక్కడ అసలు చర్చించాల్సిన అంశం వ్యక్తుల మధ్య రాజకీయ విమర్శలు, సన్మానాలు కాదు. కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందా? అవసరమైన వైద్యులు అందుబాటులో ఉన్నారా? పూర్తిస్థాయి వైద్య పరికరాలు పనిచేస్తున్నాయా? మందుల కొరత లేకుండా సరఫరా జరుగుతోందా? అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సరైన చికిత్స అందుతోందా? అన్నదే ప్రధాన ప్రశ్న.100 పడకల ఆసుపత్రిగా రూపుదిద్దుకున్న వైద్యశాలలో ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై ఉంది.

›› అసలు సమస్యకు పరిష్కారం ఎప్పుడు?

ఎమ్మెల్యే తనిఖీలు చేశారు.. కలెక్టర్ పరిశీలించారు..అధికారులపై చర్యలు జరిగాయి.. రాజకీయ నాయకులు విమర్శలు చేశారు.. చివరకు సన్మానాలు కూడా జరిగాయి. కానీ ఈ పరిణామాల మధ్య సామాన్యప్రజలకు అందాల్సిన వైద్య సేవల పరిస్థితి ఏమిటన్నది మాత్రం కీలకంగా మారింది.వార్నింగులు ఇచ్చినంత మాత్రాన ఆసుపత్రి అభివృద్ధి చెందుతుందా? సస్పెన్షన్లతోనే సమస్యలు పరిష్కారమవుతాయా? సన్మానాలతో ఆసుపత్రిలోని లోపాలు తొలగిపోతాయా?కోరుట్ల ప్రజలకు కావాల్సింది రాజకీయ ప్రకటనలు కాదు.. ఆర్భాటపు కార్యక్రమాలు కాదు.. పూర్తిస్థాయి సౌకర్యాలతో కూడిన నాణ్యమైన ప్రభుత్వ వైద్యం.మరి కోరుట్ల 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు లభిస్తుంది? సంబంధిత ఉన్నతాధికారులు,ప్రజాప్రతినిధులు దీనిపై స్పష్టత ఇస్తారా? అన్నది వేచి చూడాల్సిందే!

మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

- పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



కొడిమ్యాల, నవంబర్ 5,(ప్రజాజ్యోతి):మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పర్యటించి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గంగారాం తండాలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠా పన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొడిమ్యాల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి,అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్),కల్యాణలక్ష్మి పథకాల చెక్కులను పంపిణీ చేశారు.సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం జీవన్ రెడ్డి,మాజీ ప్యాక్స్ చైర్మన్ మేనేని రాజ్ నర్సింగరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగభూషన్ రెడ్డి, సర్పంచులు నెరేళ్ల మహేష్, అక్కేనపెల్లి గంగవ్వ, వినోద్ నాయక్,నాయకులు గోల్కొండ రాజు, అధికారులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో 14 ఏళ్ల నిరీక్షణకు తెర

- గత ప్రభుత్వ హయాంలో అందని పరిహారం
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతో పరిష్కారం
- బాధితుడి కుమారుడు శంకరయ్యకు చెక్కు అందజేత



కొడిమ్యాల,నవంబర్ 5,(ప్రజాజ్యోతి):భూసేకరణలో భూమి కోల్పోయి పరిహారం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన గంగాధర నారాయణ కుటుంబానికి ఎట్టకేలకు ఊరట లభించింది. డి–3 కాలువ భూసేకరణలో కోల్పోయిన భూమికి సంబంధించి 2012లోనే పరిహారం చెక్కు మంజూరైనా గత ప్రభుత్వ హయాంలో అధికారులు బాధిత కుటుంబానికి అందజేయకుండా కాలయాపన చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చొరవతో పరిహారం చెక్కు అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గురువారం తహసీల్దార్ నరేష్ బాధితుడి కుమారుడు శంకరయ్యకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోగూరి భూషణ్ రెడ్డి, నాయకులు తాళ్లపెల్లి అంజయ్య గౌడ్, భరత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడితో సర్పంచ్ వ్యక్తిగత పనులు..!

- డ్రైనేజీ పనులు వదిలి పాలం వద్దకు నీళ్ల డబ్బాలు
- పంచాయతీ సిబ్బందిని సొంత పనులకు వినియోగించడంపై విమర్శలు



మల్లాపూర్ నవంబర్ 05,ప్రజాజ్యోతి:గ్రామ పారిశుద్ధ్య పనులు నిర్వహించాల్సిన పంచాయతీ కార్మికుడితో సర్పంచ్ వ్యక్తిగత పనులు చేయించుకుంటున్నారనే ఆరోపణలు కుస్తాపూర్ గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి.గ్రామంలో డ్రైనేజీ కాలువల శుభ్రత పనులు కొనసాగుతున్న సమయంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న వ్యక్తిని తన పొలం వద్దకు నీళ్ల డబ్బాలు తీసుకురావాలని సర్పంచ్ ఆదేశించినట్లు కార్మికుడు తెలిపినట్లు సమాచారం.ప్రజాధనంతో వేతనం పొందుతున్న పంచాయతీ కార్మికులను గ్రామ అభివృద్ధి,పారిశుద్ధ్య పనులకే వినియోగించాల్సి ఉండగా,వ్యక్తిగత పనులకు పంపడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై ప్రశ్నించగా.. సర్పంచ్ తమకు బాస్ అని,ఆయన చెప్పిన పని చేయాల్సిందేనని కార్మికుడు సమాధానమిచ్చినట్లు తెలిసింది.ఈ వ్యవహారంపై గ్రామ కార్యదర్శి స్పందించారా, సిబ్బంది విధుల విషయంలో సర్పంచ్‌కు సూచనలు చేశారా, అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీ సిబ్బందిని వ్యక్తిగత పనులకు వినియోగించడంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి,బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేటాడి పట్టుకున్నారు.. ప్రశంసలు అందుకున్నారు

- నిందితుల పట్టివేతలో ఎస్సై, సీఐ చాకచక్యం
- పోలీసు అధికారులకు ఎస్పీ అభినందనలు..బహుమతులు



కొడిమ్యాల, నవంబరు 5 (ప్రజాజ్యోతి): మండలంలోని సూరంపేట శివారులో జరిగిన రాబరీ కేసును పోలీసులు స్వల్ప వ్యవధిలోనే ఛేదించారు.కేసును సవాలుగా తీసుకుని నిందితులను గుర్తించి అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్సై నరేష్‌కుమార్, మల్యాల సీఐ రాజ్‌కుమార్‌ల పనితీరును జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంలో చూపిన చొరవను ప్రశంసిస్తూ బహుమతులు అందజేశారు.

యాసంగి సాగుపై రైతులకు దిశానిర్దేశం



మల్లాపూర్, నవంబర్ 5,ప్రజాజ్యోతియాసంగి సీజన్‌లో రైతులు వరి పంట సాగు చేసినష్టపోవద్దని,నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని ఆరుతడి పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య సూచించారు. గురువారం సిరిపూర్ గ్రామ పంచాయతీ వద్ద సాగు సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. ఆరుతడి పంటల సాగుతో రైతులు లాభాలు పొందవచ్చని, మినుము విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కూరగాయల నారు, డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులు,పండ్లతోటలు,సోలార్ ఫెన్సింగ్‌కు అందించే సబ్సిడీల గురించి వివరించారు. తహసీల్దార్ రామచందర్ మాట్లాడుతూ రైతులు పొలాల్లో ఫారం పాండ్స్, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకుని వర్షపు నీటిని సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెక్కపల్లి సౌజన్య, ఉపసర్పంచ్ నాగార్జున, ఆర్ఐ అశోక్, ఏఈఓ రంజిత్, పంచాయతీ కార్యదర్శి రవీందర్, జీపీఓ మమత, కారోబార్ సందీప్‌తో పాటు రైతులు శ్రీనివాస్, బాపు రెడ్డి, కోట భూమరాజు, పోగుల నారాయణ, ఆశన్న, నాగేష్ పాల్గొన్నారు.